MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి : 22 సంచిక: 6 రంగారెడ్డి ఫిబ్రవరి 2024 పేజీలు : 36 వెల : రూ. 10/-

## ఎఫ్ పి ఓలలో మహిళా వికాసం!




ఎఫ్ పి ఓలలో మహిళా రైతుల ప్రాధాన్యంపై ఏపిమాస్ నిర్వహించిన వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న నాబార్డ్ తెలంగాణా ప్రాంతీయ కార్యాలయం సి జి ఎం శ్రీమతి సుశీల చింతల ... క్రింద ... సదస్సులో జ్ఞాపికల అందజేత








## లక్కీ ఛాన్స్ !



## ఒకటికి ఆరు !





అనంత చిరుధాన్యాల పండుగ దృశ్యం


NABARD నాబార్డ్ సౌజన్యంతో ....

# భూమి, నీటి సంరక్షణ మరియు యాజమాన్యం

భూమిలో సారం ... మొలకకు ఆధారం

కీలక దశలో అందే నీరే పెరిగే పంటకు జీవం

## చేపట్టే పనులు




NABARD

# మహిళా సాధికారత

సంపుటి 22 సంచిక 6



సంపాదకీయం

## ప్రాధాన్యత !

'సంస్కృతంలో ఒక శ్లోకం వుంది. 'సృష్టిలో పనికిరాని వ్యక్తి లేదా ప్రాణి లేదా మొక్క లేదా పదార్థం అంటూ ఏదీ లేదు. అన్నీ పనికివచ్చేవే, ఉపయోగపడేవే! కావలసింది వాటిని ఎక్కడ, ఎప్పుడు, ఎలా సద్వినియోగం చేసుకోవాలో తెలిసిన నేర్పరి, సూత్రధారి' అని ఆ శ్లోక భావం. వివిధ కారణాలవల్ల మన సమాజంలో తరతరాలుగా పాతుకుపోయిన కొన్ని అనుమానాలు, భయాలు, హేతుబద్ధంకాని నమ్మకాలు కొందరిని నిష్కారణంగా అయోగ్యులని ముద్రవేసి, అవమానాలపాలు చేస్తే, మరికొందరిని అంతే నిర్హేతుకంగా అందలాలెక్కిస్తున్నది. ఈ కోవలో మహిళలు చిన్నచూపునకు గురికావడం అతి సాధారణ విషయంగా తయారైంది. వారు ఎన్ని రంగాల్లో ఎంతటి ప్రతిభ కనబరచినా, ఎన్ని మెట్లెక్కినా, ఎంతటి విజయాలు సాధించినా వారికి కీలక బాధ్యతలు అప్పగించడానికి ఎప్పుడూ వెనుకాడడమే! ఉదాహరణకు వ్యవసాయ రంగంలో మహిళలు ఎన్ని పనులు చక్కబెడుతున్నా, వారిది నిర్ణయాత్మకమైన పాత్ర కానేకాదు. చాకిరీ వరకు మాత్రమే వారు పరిమితం. కొనుగోళ్ళు, అమ్మకాల వంటి ప్రధాన నిర్ణయాలలో వారికి పాత్ర వుండదు. ఇది ఒక చేదు నిజం. మన కళ్ళ ఎదురుగానే పెద్దగా చదువు, లోకజ్ఞానం లేని గ్రామీణ మహిళలు సైతం స్వయంసహాయ సంస్థలను నిర్వహించడంలో అద్భుతమైన ప్రతిభాపాటవాలను కనబరచి, కొత్త చరిత్ర సృష్టించిన వాస్తవం నిలువెత్తున కనబడుతున్నా, మహిళలకు వివిధ రంగాలలో తగిన ప్రాధాన్యం యివ్వడానికి సమాజం వెనుకాడుతూనే వుంది. శాసన నిర్మాణ సభలలో మహిళలకు కేవలం 30 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే ప్రతిపాదన రూపుదాల్చడానికి దశాబ్దాలు ఎదురుచూడవలసి వచ్చింది. పేదరిక నిర్మూలన మహో సంకల్పంలో నాడు స్వయంసహాయ ఉద్యమం మహిళల జయపతాకను ఎగురవేయగా, యిప్పుడు వ్యవసాయరంగంలో చిన్న, సన్నకారు రైతుల అభ్యున్నతికి, తద్వారా గ్రామీణ పేదరిక నివారణలో మరో ముందడుగు వేయడానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ( ఎఫ్ పి ఓలు) వేదికగా నిలుస్తున్నాయి. ఇది ఎంతైనా హర్షణీయమైన, స్వాగతించదగిన పరిణామం. కాని, బాధాకరమైన విషయం ఏమిటంటే, ఈ ఎఫ్ పి ఓలలో సైతం మహిళా రైతులకు తగిన ప్రాతినిధ్యం, ప్రాధాన్యం లభించడం లేదు. దేశం మొత్తంలో ఏర్పాటైన ఎఫ్ పి ఓలలో కేవలం మూడంటే మూడు శాతం మాత్రమే మహిళా ఎఫ్ పి ఓలు వున్నాయంటే, పరిస్థితి ఎంత దయనీయంగా వుందో అర్థంచేసుకోవచ్చు. తొలినుంచి మహిళా సంపూర్ణ సాధికారత కోసం కృషిచేస్తున్న ఏపిమాస్ , అనేక ప్రభుత్వ ప్రభుత్వేతర వేదికలనుంచి ఈ అసమంజసమైన అసమానత్వాన్ని , అప్రాధాన్యాన్ని పశ్నిస్తూనే వున్నది, దానిని సరిచేసే కృషి తన పరిధిలో తాను సాగిస్తూనే వున్నది. అందులో భాగంగానే యిటీవల ఎఫ్ పి ఓలలో మహిళా ప్రాధాన్యతపై పలువురు నిపుణులతో చర్చాగోష్ఠి నిర్వహించింది. ప్రతి విషయంలో అనుకూలాలతో పాటు , కొన్ని ప్రతికూలాలు కూడా వుంటాయి. ఉదాహరణకు మహిళలను రైతులుగా గుర్తించడానికి చట్టపరమైన కొన్ని అవరోధాలు వున్నాయని , యితర యేవో అడ్డంకులను ప్రభుత్వ వర్గాలు చెబుతాయి. కాని కావలసింది దృఢ సంకల్పం. ఇలాంటి చర్చా గోష్ఠులు మరి కొన్ని జరగాలి. అనుకూల , ప్రతికూలాలను కూలంకషంగా చర్చించి, పరిష్కార మార్గాలను అన్వేషించాలి. దేశంలో పదివేల ఎఫ్ పి ఓలను ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వం సంకల్పించినప్పటికి, యింకా 8,000 ఎఫ్ పి ఓలు కూడా ఏర్పాటు కాలేదు. మిగిలిన ఎఫ్ పి ఓలనైనా మహిళా ఎఫ్ పి ఓలుగా ఏర్పాటు చేయడం కొంతలో కొంత మెరుగైన ప్రతిపాదన కావచ్చు. ఆ దిశగా ప్రభుత్వాలు, సంబంధిత వివిధ సంస్థలు చొరవ చూపాలి. ఇప్పటికే ఏర్పాటైన ఎఫ్ పి ఓలలో కూడా మహిళా సభ్యత్వాన్ని పెంచుకుని, వ్యవసాయంలో 80 శాతం పనులు నిర్వహిస్తున్న మహిళలకు తగిన గౌరవం, ప్రాతినిధ్యం, ప్రాధాన్యం కల్పించడానికి కృషి జరగాలి. త్వరలోనే ఈ సత్సంకల్పం కార్యరూపం దాల్చుతుందని ఆశిద్దాం!

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

ఓర్పు ఎంత కష్టమనిపిస్తుందో, దాని వల్ల కలిగే ప్రతిఫలం అంత ఆనందంగా వుంటుంది

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఎల్. భవాని, జి. దివ్యశ్రీ, ఎం. భార్గవి, జి. శ్రీనివాస్, ఎస్. ప్రహ్లాదయ్య

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు

సమన్వయ సహకారం : పి. ఝాన్సీ లక్ష్మి

**లోపలి పేజీలలో ....**

➪ ఎఫ్ పి ఓలలో మహిళలకు ప్రాముఖ్యత 05
➪ ఎఫ్‌పిఓలకు కార్యక్రమాలే ఊపిరి 08
➪ దహేగాం మహిళా రైతులు 10
➪ ఆహారపదార్థాలపై అపోహల తొలగింపు 12
➪ పిండివంటలకు బ్రాండ్‌ఇమేజ్..సావిత్రమ్మ 13
➪ 'అనంత' చిరుధాన్యాల పండుగ ! 16
➪ ఈ కంది ఒక్కసారి వేస్తే ఆరేళ్ళు కాస్తుంది 17
➪ సాధారణ కూలీ...నేడు పెద్ద కంపెనీ సిఇఓ 18
➪ వ్యవసాయ భూముల లావాదేవీల్లో విప్లవం 20
➪ మధుమేహానికి, విషానికి ఔషధపు మొక్క 22
➪ గణతంత్ర దినోత్సవంలో నారీశక్తి 23
➪ తుపానుకు దెబ్బతిన్నా.. విరగ్గాసిన పత్తి! 24
➪ అత్యంత తెలివైన విద్యార్థిగా ప్రీషాచక్రవర్తి 25
➪ తాకడంలోని తేడాలను పిల్లలకు చెప్పండి... 26
➪ బియ్యం కడిగిన నీళ్ళతో చర్మసౌందర్యం! 27
➪ తగ్గిన తెల్లజొన్న సాగు ... పెరిగిన గిరాకీ ! 28
➪ కూలీలు దొరకక చేలల్లోనే తెల్లబంగారం 29
➪ ఘోర వైరస్ ..48వేల ఏండ్ల తర్వాత మళ్ళీ ! 30
➪ అత్తా కోడళ్ళపై హైకోర్టు సంచలన తీర్పు 31
➪ గ్రామంలో వ్యవసాయ,పాల,చేపల సంఘాలు 32
➪ కూరగాయ విత్తనాల చిరునామా చందన ! 33
➪ పేదరికం పోవాలంటే 200ఏండ్లు: ఆక్స్‌ఫాం 34

## 'మహిళాభివృద్ధి సొసైటీ' (ఏపిమాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.

| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | | |
|---|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : | రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**

మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్‌వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్ : 08413-403118
Web: www.apmas.org, E Mail: info@apmas.org

నిరంతరం వెలిగే సూర్యుణ్ణి చూసి చీకటి భయపడుతుంది, నిరంతరం శ్రమించే వ్యక్తిని చూసి ఓటమి భయపడుతుంది

# ఎఫ్ పి ఓలలో మహిళలకు ప్రాముఖ్యతపై గోష్ఠి !

**రైతు** ఉత్పత్తిదారుల సంస్థలలో (ఎఫ్‌పీఓలలో) మహిళల ప్రాముఖ్యతపై చారిత్రక, ప్రస్తుత, భవిష్యత్తు కోణాలను అన్వేషించడం గురించి ఏపిమాస్ ఎండి, సిఇఒ సి.ఎస్. రెడ్డి నేతృత్వంలో హైదరాబాదులోని ఏపిమాస్ ప్రధాన కార్యాలయంలో జనవరి 19 వ తేదీన విషయ నిపుణుల చర్చాగోష్ఠి జరిగింది. నాబార్డ్, ప్రదాన్, మాకమ్, ఏజీ హబ్, పిజెటిఎస్ఎయు, ఏపిమాస్ సంయుక్త భాగస్వామ్యంలో ఈ గోష్ఠి నిర్వహించారు.




వ్యవసాయంలో మహిళలు 80% పనులు చేస్తున్నప్పటికి, దేశం మొత్తంలో కేవలం 3% మాత్రమే మహిళా ఎఫ్‌పీఓలు నమోదు కావడం విచారకరమని ప్రారంభోపన్యాసంలో శ్రీ సి ఎస్ రెడ్డి పేర్కొన్నారు. అజీవ ప్రాజెక్ట్‌లో భాగంగా ఏపిమాస్ పాలన, వ్యాపార కార్యకలాపాలు, లాభదాయక వ్యాపారం, ఎఫ్‌పిఓ సేవలపై సాంకేతిక మద్దతుతో మహిళా ఎఫ్‌పిఓలలో సానుకూల ప్రభావం కనిపించినట్టు ఆయన తెలిపారు.

మాకమ్ ప్రతినిధి శ్రీమతి శిల్ప వాసవవద చర్చాగోష్ఠి నేపథ్యాన్ని, రైతు ఉత్పత్తిదారుల సంస్థలలో మహిళలకు ప్రాముఖ్యత ఎందుకు? ఎలా? అనే అంశాలను వివరించారు. 80% వ్యవసాయ కార్యకలాపాలు మహిళలచే నిర్వహించ బడుతున్నాయని, భారతదేశంలో నమోదిత ఎఫ్‌పిఓలలో 3% మహిళల ఎఫ్‌పిఓలను రూపొందించడం, ఎఫ్‌పిఓ కార్యకలాపాల నుండి మహిళలను మినహాయించడాన్ని, లైంగిక విభజన కు సంబంధించిన సమగ్ర వివరాలు (డేటా) లేకపోవడం వంటి అంశాలను చర్చించారు.

మహిళలు కేవలం పంటలు పండడానికి ముందు దశలో (ప్రీ-ప్రొడక్షన్ ) పనులలో, పురుషులు మార్కెట్ భాగస్వామ్యం, నెట్వర్క్ బిల్డింగ్ వంటి పెద్ద పనులలో నిర్ణయాలు తీసుకుంటూ ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆమె అన్నారు. మహిళా వ్యాపారవేత్తల సానుకూల ప్రభావంపై కూడా ఆమె దృష్టి సారించారు.

మహిళా వ్యాపారవేత్తలు ఎక్కువ కాలం వ్యాపారంలో ఉంటారని, బలమైన పొదుపు అలవాట్లను ప్రదర్శిస్తారని, రుణాల తిరిగి చెల్లింపులను బాధ్యతాయుతంగా నిర్వహించడంతోపాటు ఆర్థిక వివేకాన్ని ప్రదర్శిస్తారని అధ్యయనాలు నొక్కి చెబుతున్నాయని ఆమె అన్నారు. మహిళలలో ఈ సామర్థ్యాలు ఎస్‌హెచ్‌జీల నుండి పొందిన అనుభవాలు అని ఆపాదించబడ్డాయి. వ్యవసాయ రంగంలో ముఖ్యంగా ఎఫ్‌పిఓలలో మహిళల సామర్థ్యాన్ని గుర్తించడం, పరపతి పొందడం అనేది విస్తృత లక్ష్యంగా పెట్టుకొని ముందుకి వెళ్ళాలి అని సూచించారు.

ఏపిమాస్ పాలకవర్గం సభ్యురాలు శ్రీమతి గౌరీ కృష్ణ "మహిళా ఎఫ్‌పిఓలు వ్యవసాయంలో మహిళా సాధికారతకు ఒక మార్గం" అనే విధాన పత్రాన్ని సమర్పించారు, అజీవ ప్రాజెక్ట్‌కి సంబంధించి చేసిన అధ్యయనం ప్రకారం మహిళలు వ్యవసాయంలో ఆర్థిక కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటారని, పురుషులు జీవనోపాధికోసం తరచుగా పట్టణ ప్రాంతాలకు వలస వెడతారని అధ్యయనం పేర్కొంది.

మహిళా ఎఫ్‌పిఓల కోసం జిల్లాల వారీ లక్ష్యాలు, నిర్దిష్ట శాతం మహిళల నేతృత్వంలోని ఎఫ్‌పిఓలను ప్రోత్స హించడం, మహిళల క్రియాశీల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం భూమి హక్కుల ద్వారా మహిళలకు సాధికారత, ఆర్థిక తోడ్పాటు, మార్కెట్ వసతులు, మహిళా

సానుకూల వ్యవసాయం వంటి వివిధ విధాన సమస్యలపై దృష్టి పెట్టడం కోసం సాంకేతికతలు ప్రోత్సహించాలని వివరించారు.

మహిళా ఎఫ్‌పిఓలు, మిశ్రమ ఎఫ్‌పిఓలు , పురుషుల ఎఫ్‌పిఓల కోసం లైంగిక సూచికలను పునర్నిర్వచించవలసిన అవసరాన్ని విధాన పత్రంలో ప్రధానపత్రంగా పేర్కొన్నారు.

అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం తరపున పాల్గొన్న డా. అన్నపూర్ణ నేతి మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ , ఒడిశా రాష్ట్రాలు మహిళా ఎఫ్‌పిఓలను ఏర్పాటు చేయడంలో అగ్రగామిగా వున్నాయని పేర్కొన్నారు. ప్రొడ్యూసర్ కంపెనీలలో (పిసిలు) మహిళలు ఎదుర్కొంటున్న సామాజిక కట్టుబాట్లు, ఆస్తులపై పరిమిత అధికారం వంటి సవాళ్లను చర్చించారు.

నాబార్డ్ తెలంగాణ ప్రాంతీయ కార్యాలయం సిజిఎం శ్రీమతి చింతల సుశీలకీలకోపన్యాసంచేస్తూ, ఎఫ్‌పిఓలను, ఎస్‌హెచ్‌జిలను ప్రోత్సహించడంలో నాబార్డ్ నిబద్ధతను నొక్కి చెప్పారు. వ్యవసాయ రంగంలో ఎఫ్‌పిఓలు ఎన్జీఐలకు మరింత సాధికారత , మద్దతివ్వడానికి నాబార్డ్ గత సహకారాలు, ప్రస్తుత వ్యూహాలు, భవిష్యత్తు చిత్రాన్ని వివరిస్తూ, నాబార్డ్ కార్యక్రమాలను గురించి వివరించారు. ముఖ్యంగా మహిళా ఎఫ్‌పిఓలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని ఆమె సూచించారు. భవిష్యత్తులో ముఖ్యంగా మహిళా ఎఫ్‌పిఓలకు సంబంధించిన పథకాలను నాబార్డ్ అమలు చేస్తుందని హామీ యిచ్చారు.

ఈ చర్చాగోష్ఠిలో ప్రభుత్వ విభాగాలు, జాతీయ సంస్థలు, ఎస్ ఆర్ ఎల్ ఎంలు, ఎన్‌జీఓలకు చెందిన 32 సంస్థల నుండి నిపుణులు,ప్రతినిధులు కొనుగోలుదారులు పాల్గొన్నారు. (అవి: ఏపిమాస్, మాకమ్, నాబార్డ్, టిఎన్‌ఆర్‌టిపి, ప్రదాన్, టి ఎన్ ఎస్ ఆర్ ఎల్ ఎం, రెడ్స్, పీస్, జి ఎం ఎం, మానేజ్, ఎ ఎఫ్ ఇ సి, జలజీవిక, ఎలీప్, నాబ్‌కాన్స్, మారి, ఎన్ ఐ ఆర్ డి పి ఆర్, ఏకలవ్య ఫౌండేషన్, ఆర్ ఎస్ వి, ఏజీ హబ్, ఎస్‌విపి, ఆనంది, పిలుపు, జె వి ఆర్ డి ఎస్, సి ఎస్ ఎ, సి పి ఎఫ్, నారమ్, సెహగల్ ఫౌండేషన్, ఐఐఎంఆర్, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం, టిడబ్ల్యుడి, కల్గుడి). తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, ఢిల్లీ , కర్నాటక రాష్ట్రాలనుండి వివిధ సంస్థల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు ఎనిమిది మంది మహిళా ఎఫ్ పి ఓలు, విశ్రమ ఎఫ్‌పీఓ ల నుండి బోర్డు సభ్యులు కూడా పాల్గొన్నారు.

**రెండు సెషన్లు**

ఎఫ్‌పీఓలలో మహిళల ప్రాముఖ్యతను పెంచడం కోసం కృషి ప్రారంభించడం , వ్యవసాయ విలువ గొలుసులో మహిళల పాత్రను మెరుగుపరచడం, పాల్గొనే వారందరికీ మహిళా ఎఫ్‌పీఓలతో పనిచేసే అనుభవాన్ని అందించడానికి అవకాశం కల్పించాలని గోష్ఠి అభిప్రాయపడింది. సమగ్ర లైంగిక సమానత్వ విధానాన్ని రూపొందించడం, భాగస్వాములతో ఆర్థిక సహకారాలు, మహిళల నేతృత్వంలోని ఎఫ్‌పీఓ రిజిస్ట్రేషన్లను పెంచడం, ఎస్‌హెచ్‌జీ అనుభవాన్ని ఏకీకృతం చేయడం, ఎఫ్‌పీఓ వైఫల్యాలను నివారించడం, ప్రత్యేక శిక్షణ ద్వారా మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించడం వంటి అంశాలను చర్చించడం జరిగింది.

శ్రీజ డెయిరీ కోఆపరేటివ్ విజయగాథను పంచుకున్నారు. వెలుపలి సహకారంపై ఆధారపడటం నుండి కమ్యూనిటీ ఆధారిత బలమైన చొరవగా అభివృద్ధి చెందింది. వాల్యూచైన్, వాల్యూ అడిషన్, టెక్నాలజీ అడాప్షన్, హ్యూమన్ రిసోర్స్ సవాళ్లు , పాలనాపరమైన సవాళ్లు వంటి కీలక అంశాలను చర్చించారు. టైకార్, సెహగల్ ఫౌండేషన్, ఏఐఎఫ్, టిఎన్‌ఎస్‌ఆర్‌ఎల్‌ఎం నుండి వచ్చిన ప్రతినిధులు తమ ఎఫ్‌పిఓలలో మహిళలకు సాధికారత కల్పించే ప్రయత్నాలపై విలువైన అనుభవాలను పంచుకున్నారు.

**సమావేశ ముఖ్య ఫలితాంశాలు**

1. లైంగిక సమానత్వ విధానం: ఎఫ్‌పీఓలలో లైంగిక సూచికలను చేర్చడాన్ని ప్రోత్సహించే సమగ్ర విధానాన్ని రూపొందించాలి.
2. ఆర్థిక సహకారం: నాబార్డ్, ప్రదాన్ , ఇతర భాగస్వాములతో కలిసి లైంగిక సమానతపై దృష్టి

సారించడానికి ఆర్థిక సహాయ విధానాలను రూపొందించాలి

3. మహిళా ఎఫ్పీఓల పెంపుదల: మహిళా ఎఫ్‌పీఓల నమోదును గణనీయంగా పెంచడానికి, లక్ష్యాలను నిర్దేశించుకోవాలి.

4. ఎస్‌హెచ్‌జీ అనుభవంతో ఏకీకరణ: ఎఫ్‌పీఓ సిఈఓలు, బోర్డ్ సభ్యుల కోసం తగిన శిక్షణా మాడ్యూళ్లను రూపొందించడం ద్వారా వ్యాపారం, విలువ జోడింపు మార్కెటింగ్ వంటి అంశాలలో ఎస్‌హెచ్‌జీల అనుభవాల అవగాహన.

5. ఎఫ్‌పీఓల వైఫల్యాలను నిరోధించడం: ఎఫ్‌పీఓలు వైఫల్యం చెందడాన్ని నివారించడంపై దృష్టి సారించాలి, సమిష్టి బాధ్యతకు ప్రాధాన్యం యివ్వాలి

6. ఎస్‌హెచ్‌జీ ఇంటిగ్రేషన్: ఎఫ్‌పీఓ కార్యకలాపాలలో ఎస్‌హెచ్‌జీ అనుభవం , సామాజిక మూలధనం ప్రాముఖ్యతను ప్రోత్సహించాలి.

7. డేటా మానిటరింగ్: లైంగిక విభజన డేటా సేకరణ , ఎఫ్‌పీఓ ల పర్యవేక్షణను మెరుగుపరచడానికి సంబంధించిన విధానాలను మెరుగుపరచాలి.

8. మహిళా నాయకత్వ ప్రోత్సాహం: మిశ్రమ ఎఫ్‌పీఓలలో మహిళా నాయకుల, ముఖ్యంగా గిరిజన మహిళల సామర్థ్యాలను ప్రోత్సహించే , పెంపొందించే విధానాలను బలపరచడం

9. మహిళా సానుకూలసాధనాలు: ఐ టి, వ్యవసాయ రంగాలలో మహిళా సానుకూల సాధనాలను, విధానాలను రూపొందించడం

10. జాతీయ, అంతర్జాతీయ అనుసంధానాలు: ఎఫ్‌పీఓల వ్యాపార కార్యకలాపాలలో మహిళల నాయకత్వాన్ని ప్రోత్సహించే జాతీయ , అంతర్జాతీయ కార్యక్రమాలతో అనుసంధానాన్ని ప్రోత్సహించడం

11. లైంగిక ప్రాధాన్య ఎఫ్‌పీఓ నమోదు లక్ష్యాలు: మహిళా ఎఫ్‌పీఓల నమోదు కోసం జిల్లాల వారీ లక్ష్యాలతో విధానాలరూపకల్పన.



12. భూమి , ఆర్థికత ద్వారా సాధికారత: భూమి హక్కులు, ఆర్థిక వ్యవహారాలలో మెరుగైన ప్రాధాన్యత , ప్రత్యేక ఆర్థిక సాధనాల ద్వారా మహిళా సాధికారతను ప్రోత్సహించే విధానాల రూపకల్పన

13. మహిళానుకూల వ్యవసాయ సాంకేతికతలు: మహిళానుకూల వ్యవసాయ సాంకేతికతలను ప్రోత్సహించే విధానాల రూపకల్పన, అమలు

14. పరిమాణ సూచికల పునర్నిర్వచనం: మహిళా ఎఫ్‌పీఓలు, మిశ్రమ ఎఫ్‌పీఓలు మరియు పురుషుల నేతృత్వంలోని ఎఫ్‌పీఓల కోసం వేరువేరుగా పరిమాణ సూచికలను రూపొదించి, అమలుచేయడం

15. వ్యాపార ప్రక్రియలు మరియు నెట్‌వర్క్ మద్దతు: వ్యాపార ప్రక్రియలు, ప్రామాణిక ఆపరేటింగ్ విధానాలు బలమైన వ్యాపార నెట్ వర్క్‌ను నిర్మించడం ద్వారా మహిళా ఎఫ్‌పీఓలకు మద్దతు ఇచ్చే విధానాలను రూపొందించడం.

16. ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు: గిరిజన మహిళలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎఫిఓలలో మహిళా నాయకత్వం కోసం లక్ష్య శిక్షణ కార్యక్రమాలను అభివృద్ధి చేయడం

17. ఎఫ్‌పీఓ బోర్డ్ లో మహిళా ప్రాతినిధ్యం: కనీసం 30% మహిళా సభ్యులను వాటాదారులుగా , బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ (బిఓడి) సభ్యులుగా చేర్చాలని నచ్చజెప్పడం. ■

నచ్చిన పనిని మూర్ఖుడైనా గొప్పగా చేయగలడు, కాని ప్రతి పనినీ తనకు నచ్చే రీతిలో మలుచుకోవడమే వివేకి లక్షణం

# ఎఫ్ పి ఓలకు అనుసంధాన కార్యక్రమాలే ఊపిరి !

**– ఎస్. ప్రహల్లాద, ఎన్.వినాయక రెడ్డి**

**భా**రతదేశంలో స్వయం సహాయ ఉద్యమం విజయ వంతమై , అత్యధిక సంఖ్యలో  మహిళలు స్వయం సహాయ సంఘాలలో  చేరి వారి కుటుంబ జీవనోపాధులను పెంచు కోవడం కోసం ఎటువంటి హామీ లేకుండా ప్రతి మహిళా దాదాపు రెండు లక్షల రూపాయల వరకు బ్యాంక్ నుండి అప్పులు తెచ్చుకొనే స్థాయికి ఎదిగారు. అంతేగాక వారు తెచ్చే అప్పులు వారి కుటుంబ వివిధ రకాల అవసరాలకు వినియోగించుకుంటూ తీసుకున్న అప్పులను క్రమం తప్పక బ్యాంక్‌కు తిరిగి చెల్లిస్తూ దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందారు.



ఇదేవిధంగా చిన్న, సన్నకారు  రైతులు కూడా తమ వ్యవసాయ అవసరాలను తామే తీర్చుకొనే విధంగా విప్లవాత్మక మార్పులతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు ఉత్పత్తిదారు సంస్థలకు (ఎఫ్ పి ఓలకు) తోడ్పాటు అందిస్తున్నాయి.

జాతీయ రైతు ఉత్పత్తిదారుల సంస్థల సమాఖ్య (ఎన్ఎఎఫ్‌పిఓ)–2023 నివేదిక ప్రకారం ప్రస్తుతానికి దేశంలో మొత్తం 24,183 రైతు ఉత్పత్తిదారు సంస్థలు ఏర్పాటైనవి.  ఈ సంస్థలను ఏర్పాటు చేయుటకు దేశవ్యాప్తంగా దాదాపు 200 స్వచ్ఛంద సంస్థలను ప్రభుత్వం గుర్తించి, వాటిద్వారా ఎఫ్ పి ఓలకు తోడ్పాటు అందిస్తున్నది. దేశవ్యాప్తంగా ఈ రైతు ఉత్పత్తిదారు సంస్థలలో ఒక కోటి ఇరవై ఒక్క లక్షల మందికి పైగా  రైతులు సభ్యులుగా వున్నారు.

ఈ రైతు ఉత్పత్తిదారు సంస్థలకు అందుబాటులోని నిధులను క్లుప్తంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు.

| పెట్టుబడి నిధులు | నిర్వహణ నిధులు |
|---|---|
| సభ్యుల నుండి | సభ్యుల నుండి |
| వాటాధనము | సభ్యత్వ రుసుము |
| ప్రభుత్వం నుండి ఈక్విటి | వ్యాపారం ద్వారా లాభాలు |
| నిధులు/(గ్రాంట్స్) | ప్రభుత్వ పథకాల  నుండి |
| సౌకర్యాల కల్పన నిధులు | నిర్వహణ నిధులు |
| బ్యాంక్‌ల నుండి రుణాలు | చందాలు / సంస్థల (గ్రాంట్స్ |

రైతు ఉత్పత్తిదారు సంస్థల  నిర్వహణకు  అయ్యే వ్యయాలలో ముఖ్యంగా సిబ్బంది జీతాలు, కార్యాలయ బాడుగలు, ఇతర ఖర్చులు వుంటాయి. వీటిని సభ్యుల నుండి సభ్యత్వ రుసుం, చేపట్టిన వ్యాపారంలో వచ్చే లాభాలు, ప్రభుత్వం యిచ్చే నిర్వహణ వ్యయాలతో  భరిస్తారు. ఉదాహరణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 10 కే పథకంలో భాగంగా మంజూరు అయిన సంస్థలకు కేంద్ర ప్రభుత్వం మూడు సంవత్సరాల పాటు నిర్వహణ వ్యయాలను సమకూరుస్తుంది. ఇదేవిధంగా ఎం.ఐ.డి.హెచ్ పథకంలో భాగంగా మంజూరు అయిన సంస్థలకు ఉద్యానశాఖ వారు మూడు సంవత్సరాలపాటు నిర్వహణ నిధులు ఇస్తారు. మూడు సంవత్సారాల కాల పరిమితి అనంతరం ఎఫ్ పి ఓలు వాటి స్వంత నిధులతో  నిర్వహించుకోవాలి. అందువల్ల నిర్వహణ నిధుల సమీకరణ అతి కీలకం!

**ఏపిమాస్ ఏర్పాటు చేసిన ఎఫ్ పి ఓలు**

ఏపిమాస్ సంస్థ ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణా రాష్ట్రాలలో మొత్తం 84 రైతు ఉత్పత్తిదారు సంస్థలను ఏర్పాటు చేసి, సభ్య రైతులకు కావలసిన వివిధ రకాల సాంకేతిక, మార్కెటింగ్ సేవలు అందిస్తున్నది. ఇందులో 45 సంస్థలు కేంద్ర ప్రభుత్వ 10కె పథకంలో భాగంగా ఏర్పాటు కాగా,

మిగిలిన సంస్థలు ఇతర ప్రోత్సాహక నిధుల ద్వారా ఏర్పాటయ్యాయి. వీటిలో కొన్ని సంస్థలు ఐదు వసంతాలు పూర్తి చేసుకుని, యితరత్రా ఎటువంటి ఆర్థిక తోడ్పాటు లేకున్నా స్వంత నిధులతో ముందుకు సాగుతున్నాయి.

**అనుసంధానాలతోనే భవిష్యత్తు**

"స్వంత ఇల్లు వుంటే పగలంతా ఏమి పని దొరికినా, దొరకకపోయినా, తిన్నా తినకపోయినా సాయంత్రానికి గూటికి చేరితే అడిగే వారు వుండరు" అనే సామెత మన రైతు ఉత్పత్తిదారు సంస్థలకు చక్కగా వర్తిస్తుంది. దేశవ్యాప్తంగా ఏర్పాటైన రైతు ఉత్పత్తి దారు సంస్థలలో చాలామటుకు మూడు సంవత్సరాలు ముగిసి ప్రాజెక్ట్ ప్రోత్సాహక నిధులు ఆగిపోతే , తమ దగ్గర వున్న నిధులను మరో సంవత్సరం వాడుకొని ఆ నిధులు అయిపోగానే మూతపడుతున్నాయి. అందువలన "దీపం ఉండగానే ఇల్లు చక్క దిద్దుకోవాలి" అనే మరో సామెతలో చెప్పినట్లు రైతు ఉత్పత్తిదారు సంస్థలు నిర్వహణ నిధులు అందుబాటులో వున్న మొదటి మూడు సంవత్సరాలలో మౌలిక సదుపాయాలను ముఖ్యంగా కార్యాలయ భవనాలను సమకూర్చుకోవాలి. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే వివిధ రకాల పథకాలను వినియోగించుకోవాలి.

పండ్లు , కూరగాయల వ్యాపారం చేయుటకు కావలసిన మౌలిక సదుపాయాల కల్పనకు 75 శాతం సబ్సిడీతో 'సేకరణ కేంద్రం' అనే పథకాన్ని ఉద్యానశాఖ అమలు చేస్తున్నది. ఈ నిధులతో సంస్థలకు కావలసిన భవనాలను నిర్మించు కోవచ్చు. ఇంతేగాక సంస్థల కార్యక్రమాలను ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియజేసి, వారి నుండి సేకరణ కేంద్రాన్ని నిర్మించుకోవడానికి కావలసిన స్థలాన్ని ప్రభుత్వం నుండి ఉచితముగా పొందవచ్చు. లేదా సభ్య రైతుల వద్ద నుండి తక్కువ బాడుగకు భూములను తీసుకొని ఆ స్థలంలో కార్యాలయాలను నిర్మించుకొనవచ్చు.

ఉదాహరణకు చిత్తూరు, అనంతపురం జిల్లాలలో కొన్ని రైతు ఉత్పత్తిదారు సంస్థలు ప్రభుత్వం నుండి స్థలాన్ని ఉచితంగా పొంది కార్యాలయ భవనాలు ఏర్పాటు చేసుకోగా, ఉద్యానశాఖ ద్వారా ఏర్పాటైన సంస్థలు రైతుల వద్ద నుండి




తక్కువ బాడుగకు స్థలము తీసుకొని సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసుకొని వాటిలో కార్యాలయాన్ని, వ్యాపార కేంద్రాలను నిర్వహిస్తున్నాయి.

వ్యవసాయశాఖ ద్వారా అద్దె పరికరాల కేంద్రం, మందులు పిచికారీ చేసే యంత్రాలు, పశు వైద్యశాఖ ద్వారా గడ్డి కత్తిరించే యంత్రాలు, గడ్డి మోపులు కట్టే యంత్రాలు మొదలగునవి అందుబాటులో వున్నాయి. వాటిని వినియోగించుకున్నట్లయితే రైతు ఉత్పత్తిదారు సంస్థలకు నిరంతర ఆదాయం ఉంటుంది.

**సామర్థ్యం పెంపుదలలో కంపెనీలు :** వివిధ రకాల ఎరువులు, క్రిమిసంహారక మందులు, పశువుల దాణా మొదలగు వాటిని తయారుచేసే కంపెనీలు వాటి ఉత్పత్తు లను గ్రామాలలోని రైతులు వినియోగించుకునేలా చేయ డానికి వివిధ రకాల శిక్షణలు ఏర్పాటు చేస్తున్నాయి.

ఇందులో పంట యాజమాన్య పద్ధతులు, నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్య పద్ధతులు, కోత దశలో తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలగు వాటిని రైతులకు తెలియజేయాలి. ఇటువంటి అవకాశాలను రైతు ఉత్పత్తిదారుల సంస్థల సిబ్బంది, ప్రోత్సాహక సంస్థలు సమర్థంగా ఉపయోగించు కొని వారి సభ్య రైతులు వీటిద్వారా ప్రయోజనం పొందేలా చూడాలి.

అప్పుడే సభ్య రైతులకు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఆశించిన విధంగా ఉపయోగపడగలుగుతాయి. ■



# వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారంలో దహేగాం మహిళా రైతులు

**– మురళి జాజున**

దహేగాం మహిళా రైతు ఉత్పత్తిదారుల కంపెనీ (ఎఫ్ పి సి) ఏర్పడి (నమోదై) నేటికి ఏడాది అయింది. సంస్థ స్వంత నిధులు అంతంత మాత్రమే. కేవలం 2.7. లక్షలే. సభ్యుల చేరికకు చేయని ప్రయత్నం లేదు. అయినా



నిరాశే. "మీరు సభ్యులుగా ఉండడం వల్ల మీకు ఒరిగింది ఏమిటి" అనే జవాబులేని ప్రశ్నలు. అయితేనేం పాలకవర్గ సభ్యులు కృంగిపోలేదు. తీవ్రంగా చర్చించారు, తర్జన భర్జన చేశారు. ధైర్యంగా ముందుకు అడుగు వేద్దామని, లాభ నష్టాల తర్కాన్ని ప్రక్కన పెట్టారు. మొదట సభ్యులకు కొంతవరకు ఖరీఫ్ సీజన్లో ఎరువులు సమయానికి అందించారు. అయినా ఇంకా సభ్యులలో నమ్మకం రాలేదు. ప్రస్తుతం ఉన్న సభ్యులకు మరింత సేవలు అందించకపోతే క్రొత్తగా సభ్యులు చేరడం అసాధ్యం అని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు శ్రీకారం చుట్టారు.

అధ్యక్షురాలు శ్రీమతి ప్రపూర్ణ , కార్యదర్శి శ్రీమతి రాజేశ్వరి ఇతర బోర్డు సభ్యుల సహకారంతో మొదటగా "చౌకా" అనే గ్రామంలో రైతులనుండి గత నెలలో వరి ధాన్యం కొనుగోలుచేసి దగ్గరలోని రైస్ మిల్లు వారికి అమ్మారు. రైతులకు ముందు కొంత డబ్బు ఇచ్చి మిగతావి పది రోజులలో ఇస్తామని హామీ యిచ్చారు. సుమారుగా 400 క్వింటాళ్ళ ధాన్యం కొనుగోలు చేశారు. రైస్ మిల్లు నుండి డబ్బు రాగానే సభ్యులకు డబ్బులు చెక్కు ద్వారా అందించారు.

ఈ వ్యాపారంలో టర్నోవరు 8.76 లక్షలు కాగా, ఖర్చులు పోను మిగులు రూ. 15,180 మిగిలింది. మరింత ఉత్సాహంతో తెల్ల బంగారం "ప్రత్తి" కొనుగోలు కూడా ప్రారంభించారు. మొదట పంట నాణ్యత చూసి, బేరం కుదుర్చుకొని, సభ్యులతో మౌఖిక ఒప్పందం చేసుకున్నారు. రవాణా, లేబరు సౌకర్యాలు సమకూర్చు కున్నారు. కేవలం 15 రోజుల్లో 253.50 క్వింటాళ్ళ ప్రత్తి కొనుగోలుచేసి, సభ్యుల పేరు మీదే సి.సి.ఐ. కి పంపించారు. సభ్యులకు వారి ఇంటి నుండి పంట కొనుగోలు, రవాణా, కూలీ భారం తగ్గుతుండడంతో, తమ పేరు మీద పంట అమ్మటానికి సిద్ధపడ్డారు. సి.సి.ఐ. నుండి డబ్బు వారి ఖాతాలోకి రాగానే మొత్తం డబ్బును కంపెనీ ఖాతాలోకి బదిలీ చేశారు.



ఈ వ్యాపారంలో టర్నోవరు 17.32 లక్షలు కాగా ఖర్చులు పోను రూ. 25,037 మిగిలింది. మొత్తంగా గత నెల రోజుల్లోనే 26 లక్షల టర్నోవరుపై రూ. 40,217/– నికర మిగులు నమోదు కావడం గొప్ప విషయం ! సంస్థ సిబ్బంది చంద్రయ్య, ఆశిష్ పూర్తి సహకారం ఇచ్చారు.



సభ్యులు తమ పాలకవర్గ సభ్యులపై నమ్మకం ఉంచారు. అన్ని రకాలుగా సహకారం ఇచ్చారు. ప్రతి బోర్డు సభ్యురాలు కూడా తమ వంతు బాధ్యత తీసుకున్నారు.

మొన్న సంక్రాంతికి సభ్యులకు కావాల్సిన సరుకులను టోకుధరకు సభ్యులకు లభింపజేయాలని నిర్ణయించి 1 లక్ష రూపాయల పండగ సరుకులు కొని సభ్యులకు బోర్డు సభ్యుల ద్వారా లాభాపేక్ష లేకుండా విక్రయించారు.

ఇలా అందివచ్చిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని, సభ్యులలో, సభ్యులుగా చేరగోరే వారిలో సానుకూలతను పెంపొందించుకున్నారు. మరో 150–200 మంది సభ్యుల చేరికకు మార్గం చేశారు.

ఈ చొరవతో, గ్రామ స్థాయిలో సంస్థ సేవల అందుబాటుకు, గ్రామ గ్రామాన సంస్థ సేవల సరఫరాదారులను నియమించే యోచనలో ఉన్నారు. ఇందుకు తగినమార్గదర్శకత్వ రూపకల్పనకోసం మహిళా అభివృద్ధి సొసైటిని (ఏపిమాస్‌ను) సంప్రతించారు. సంస్థ నిర్వహించే కార్యకలాపాలకు పాలక వర్గం చురుకైన పాత్ర, సిబ్బంది సన్నద్ధత, సభ్యుల సహకారం తప్పనిసరిగా ఉండాలనే విషయం దహేగం మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ



నిరూపించింది. ఇతర రైతు ఉత్పత్తిదారుల సంస్థలకు మార్గదర్శనం చేసింది. ఈ సంస్థ మరిన్ని విజయాలను సొంతం చేసుకోవాలని ఆశిద్దాం. ■

## తెలంగాణాలో 4 పట్టణాలకు పరిశుభ్రత పురస్కారాలు

దేశంలోనే అత్యంత పరిశుభ్ర నగరాలుగా మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, గుజరాత్‌లోని సూరత్ నిలిచాయి. ఏడేళ్లుగా క్లీన్ సిటీగా అవార్డు దక్కించుకుంటున్న ఇండోర్ ఈ ఏడాది కూడా సూరత్‌తో కలిసి సంయుక్తంగా ఆ బహుమతి అందుకుంది.

ఈ పోటీల్లో తెలంగాణ రాష్ట్రం మొత్తం నాలుగు అవార్డులను దక్కించుకుంది. లక్ష జనాభా పైబడిన నగరాల కేటగిరీలో గ్రేటర్ హైదరాబాద్ 9వ ర్యాంకును సాధించింది. కేంద్ర పట్టణాభివృద్ధి మంత్రి హర్‌దీప్ సింగ్ పురీ చేతుల మీదుగా జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్, శానిటేషన్ అడిషనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి ఈ అవార్డును అందుకున్నారు.

గుండ్లపోచంపల్లి (లక్ష కంటే తక్కువ జానాభా), నిజాంపేట (25–50 వేల జనాభా), సిద్దిపేట (50 వేలు–లక్ష జనాభా) పరిశుభ్రమైన పట్టణాల జాబితాలో నిలిచాయి. జీహెచ్ఎంసీకి అవార్డు రావడం పట్ల హైదరాబాద్ ఇంఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.

కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో న్యూఢిల్లీలోని భారత్ మండపంలో స్వచ్ఛ సర్వేక్షణ్– 2023 అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. నవీ ముంబై అత్యంత పరిశుభ్రత నగరాల జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. లక్షలోపు జనాభా ఉన్న పట్టణాల కేటగిరిలో సస్వాద్, పటాన్, లోనావాలా వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. పరిశుభ్రమైన గంగా పట్టణాల్లో వారణాసి, ప్రయాగ్ రాజ్ ప్రథమ, ద్వితీయ అవార్డులు గెలుచుకున్నాయి. ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలలో మహారాష్ట్ర మొదటి స్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్, ఛత్తీసగఢ్ తర్వాతి స్థానాలలో నిలిచాయి.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ...)

# ఆహారపదార్థాలపై అపోహల తొలగింపు

– వి. ప్రగతి

ఏపిమాస్, విప్రో కేర్స్ వారు సంయుక్తంగా గర్భిణిలు, బాలింతలు, రెండు సంవత్సరాల లోపు పిల్లల కోసం హైదరాబాద్‌లో మెహదీపట్నం, కార్వాన్ పరిధిలో నిర్వహిస్తున్న (యు ఎన్ పి)ప్రాజెక్ట్ స్వయం సహాయ బృందాలతో కలిసి పని చేస్తుంది. అయితే ఇందులో భాగంగా ఏపిమాస్ సహకారంతో కొత్త సంఘాలు ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే.

ఈ సంఘాలకు, అంతకు పూర్వం నుండి ఉన్న సంఘాలకు ప్రాజెక్ట్ బృందం ప్రతి నెల శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుంది. జనవరి నెలలో రెండు శిక్షణా కార్యక్రమాలు జరిగాయి. అందులో ఎనిమిది సంఘాల నుండి మొత్తం దాదాపు వందమంది సభ్యులు పాల్గొన్నారు.



ఈ నెల కార్యక్రమాలు పిఎల్ఎ – పార్టిసిపేటరీ లెర్నింగ్ అండ్ యాక్షన్ పద్ధతిలో నిర్వహించడం జరిగింది. ముందుగా రెండు శిక్షణా కార్యక్రమాల్లోనూ పరిచయాలు అయ్యాక సభ్యులను బృందాలుగా విడదీసి, వారి చేతికి ప్రాజెక్ట్ ముఖ్యమైన సందేశాలను రాసి ఇవ్వడం జరిగింది. ఒక్కో బృందంలో సభ్యులు ఎన్నో ఏళ్ళుగా సంఘాల్లో పనిచేసే వారున్నారు , కొత్తగా చేరినవారూ ఉన్నారు.

ఒక్కో బృందానికి కొంత సమయం ఇచ్చి ఆ సందేశాల మీద వారికి తెలిసిన నిజాలు, అపోహలు రాయమనడం జరిగింది. ఆ తర్వాత ఒక్కొక్క బృందం ముందుకు వచ్చి వారు రాసిన వాటిని వివరించారు. ఉదాహరణకి ఒక గర్భిణి, బాలింత కచ్చితంగా ఒక రోజులో పది ఆహార సమూహాల నుండి అయిదు తినాలని వారికి ఇచ్చిన దాంట్లో ఉంది. దానికి వారు ఒక్కొక్కరుగా ముందుకు వచ్చి ఏ ఏ రకాల ఆహారాలు తినాలో , ఉదాహరణకు ఆకుకూరలు ఎక్కువగా తినాలి, రోజు ఒకటి ఉడకబెట్టిన గుడ్డు తినాలి, అన్ని రకాల పండ్లు తినాలి అని వారికి తెలిసిన విషయాలు వ్యక్తపరిచారు.

ఇందుకు భిన్నంగా, కొందరు సభ్యులు గుడ్డు తినకూడదు, తింటే పుట్టబోయే బిడ్డకు బట్టతల వస్తుందని కొంతమంది, పండ్లలో అరటిపండు తింటే బిడ్డకు జలుబు, దగ్గు చేస్తుందని, బొప్పాయి పండు తింటే వేడిచేసి గర్భం పోయే ప్రమాదం ఉందని వారికున్న అపోహలను తెలియజేశారు.

అనంతరం ప్రాజెక్ట్ బృందం అవన్నీ అపోహలనీ, రోజు ఒక గుడ్డు తింటే, మాంసకృత్తులు శరీరానికి అంది, తల్లి , బిడ్డ బరువు పెరగడానికి, మంచి విటమిన్లు, లవణాలు బిడ్డకు తల్లికి బాగా అందుతాయని వివరించడంతో అర్థం చేసుకున్నారు.

తమ స్లమ్ పరిధిలోని గర్భిణీలు, బాలింతలకు తాము ఇక్కడ నేర్చుకున్న అన్ని విషయాలు వివరిస్తామని అందరూ, చాలా ఉత్సాహంగా చెప్పారు .

ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ బృందం నుండి మేనేజర్, మెంటర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొని అన్ని విషయాలు చక్కగా వివరించారు.

వీరే కాకుండా 'కాం ఫర్ యు' అనే మరో స్వచ్ఛంద సంస్థ గృహహింస, స్త్రీయ ధృవీకరణ లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. డి పి ఓ లలిత కుమారి గారు, సి ఓ తాజుద్దీన్ గారు పాల్గొన్నారు. ■

చిత్తశుద్ధి, పట్టుదల, ఓర్పు కార్యసిద్ధికి ఆవశ్యకం; వీటిని మించి చేసే పనిని ప్రేమించడం మరింత ఆవశ్యకం

# తెలంగాణ పిండి వంటలకు బ్రాండ్ ఇమేజ్ తెచ్చిన సావిత్రమ్మ !





ఎనభై ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహంతో గరిటె తిప్పుతున్నారు శ్రీమతి వంగపల్లి సావిత్రమ్మ. తెలంగాణ గవర్నర్ తమిళసై ఇటీవల ఆవిష్కరించిన '50మంది స్ఫూర్తిదాయక మహిళలు' పుస్తకంలో ప్రత్యేక స్థానం పొందిన వంగపల్లి సావిత్రమ్మ తన పాతికేళ్ల ప్రస్థానాన్ని 'నవ్య'తో పంచుకున్నారు. ఆంధ్రజ్యోతి సౌజన్యంతో ఆ విశేషాలు ' మహిళా సాధికారత ' పాఠకులకు అందిస్తున్నాం.

"నా చిన్నతనంలో సంక్రాంతి, దసరా లాంటి పండుగలప్పుడు మా ఇంట్లో వారం ముందే సందడి మొదలయ్యేది. ఇరుగుపొరుగు మహిళలందరూ ఒకచోట చేరి పిండివంటలు చేసేవారు. అప్పాలు ఒత్తడం, అరిసెల పాకం పట్టడం, సకినాలు చుట్టడం, మురుకులకు పిండి కలపడం... వాళ్ల పక్కనే కూర్చొని అన్నిటినీ ఆసక్తిగా గమనిస్తుండేదాన్ని.

కొన్నాళ్లకు నేను కూడా వారితో కలిసి గరిటె తిప్పడం ప్రారంభించాను. ఆ ఇష్టమే ఇవాళ నన్ను 'సకినాల సావిత్రమ్మ'గా ఈ లోకానికి పరిచయం చేసింది. నేడు నా చేతి పిండి వంటలు, పచ్చళ్లు దేశ, విదేశాలకు వెళుతున్నాయి. చిన్నజీయర్‌స్వామి లాంటి మహానుభావుల నుంచి సత్కారాన్ని అందుకున్నాను. 'తెలంగాణ పిండివంటలకు మంచి పేరు తెచ్చావమ్మా' అని తెలిసినవారంతా అంటుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. అయితే ఇంతటి పేరు వెనుక కొన్నేళ్ల కష్టం ఉంది.

**ఖాళీగా కూర్చోడం మహా చిరాకు ...**

చిన్నతనం నుంచి పిండివంటలు చేయడం, వాటిని ఇతరులకు ఇవ్వడం నాకు చాలా ఇష్టం. అవి తిన్నవారు 'బావున్నాయమ్మా' అంటే... ఆనందంతో నా కడుపు నిండిపోతుంది. ఖాళీగా కూర్చోడమంటే నాకు మహాచికాకు. ఒంట్లో ఓపిక ఉన్నంతవరకు ఏదో ఒక పని చేస్తుండాలి. అది నలుగురికీ మేలు చేసేది అయుండాలని అనుకొంటాను. నేనేమీ చదువుకోకున్నా... ఇదివరకు జగిత్యాలలో కొంతమంది కేరళ ఉపాధ్యాయులతో స్కూలు నిర్వహించాను. పదేళ్లు దాన్ని విజయవంతంగా నడిపించాను.

హన్మకొండలో విద్యార్థుల కోసం హాస్టల్ పెట్టాను. కొంతకాలం మెస్ కూడా నడిపాను. మా సొంతూరు కరీంనగర్ జిల్లా బీర్పూర్. నా భర్త సత్యంరావు సివిల్ కాంట్రాక్టర్. 1990లో మేం హైదరాబాద్‌కు వచ్చి స్థిరపడ్డాం. అప్పుడు మా ఇంటి ముందే టెలిఫోన్‌బూత్ ప్రారంభించాను. నలుగురికీ వండిపెట్టిన చెయ్యి కదా... ఊరికే ఉండలేకపోయాను. ఒకరోజు మూడు గ్లాసుల బియ్యం మిక్సీ పట్టి సకినాలు చేశాను. వాటిని మా ఎస్టీడీ

బూత్ ముందు పెడితే అన్నీ ఒక్కపూటలో అమ్ముడయ్యాయి.

**కేసీఆర్ ఇంట్లో ప్రతి వేడుకకూ...**

క్రమంగా సకినాలకు ఆదరణ పెరిగింది. దాంతో సర్వపిండి, మురుకులు, లడ్డూ... ఇలా ఒక్కో వంటకం రోజుకు రెండు కేజీల చొప్పున చేయడం మొదలుపెట్టాను. ఆనోటా ఈనోటా పాకడంతో తక్కువ సమయంలోనే అమ్మకాలు పుంజుకున్నాయి. మెల్లగా పెళ్లి, వడిబియ్యం సారెలకు పిండివంటల ఆర్డర్లు వచ్చాయి. సంప్రదాయాల మీద నాకు కొంత అవగాహన ఉండటంతో శుభకార్యాలను బట్టి సారెకు ఎన్ని రకాల ఐటెమ్స్ పంపాలి, అందులోనూ ఎన్ని చుట్లు సకినాలు చేయాలి లాంటి విషయాలను కస్టమర్లకు చెబుతుండేదాన్ని.

దాంతో 'సావిత్రమ్మ దగ్గర సారె వంటలు తీసుకెళితే' అవతలి వైపు నుంచి పల్లెత్తు మాట రాదని వారంతా అనుకొనేవారు. అలా కేటీఆర్ పెళ్లి సారె, కవిత ఒడి బియ్యం సారె... ఇలా కేసీఆర్ ఇంట్లో ప్రతి వేడుకకూ పిండివంటలు మా దగ్గర నుంచే వెళ్లాయి. ఇంతవరకు 'మా పిండి వంటలు కొనండి' అని నేనెన్నడూ ఒక కరపత్రం వేయించలేదు. గోడ పత్రిక ముద్రించలేదు. మా కస్టమర్లే మాకు ప్రచారకర్తలు.

**నన్ను చూసి నవ్వినవారే...**

నా చేతి వంటలకు మంచి ఆదరణ రావడంతో నా కోడలు రేణుకతో కలిసి 1998లో 'శ్రీదేవి తెలంగాణ పిండివంటకాలు' పేరుతో స్వగృహ ఫుడ్స్ ప్రారంభించాం. రోజుకు రెండు కేజీల అప్పాలతో మొదలైన వ్యాపారం ఇప్పుడు ఆరు క్వింటాళ్లకు అమ్మకాల స్థాయి పెరిగింది. పండుగలప్పుడైతే పది క్వింటాళ్లు కూడా చేస్తుంటాం.

మొదట్లో మా ఊళ్లో వారంతా 'పట్నంపోయి అప్పాలు అమ్ముకుంటున్నావా' అంటూ నన్ను చూసి నవ్వారు. ఇప్పుడు వారే నా గురించి నలుగురికీ గర్వంగా చెబుతుంటారు. ఇంకొందరు సొంతంగా అప్పాలు చేసి తెలంగాణ పిండి వంటల పేరుతో అమ్ముతున్నారు. అందుకు నాకూ సంతోషంగా ఉంది. పదిహేనేళ్ల కిందట నిజాం కాలేజీ మైదానంలో తెలంగాణ సంబురాలప్పుడు ప్రత్యేక స్టాల్ పెట్టాం. అందులో గట్కా, సర్వపిండి, అరిసెలు, సకినాలు, బిళ్ల అప్పాలు లాంటివన్నీ ఒక్కపూటలో అయిపోయాయి. ఆ స్టాల్‌వల్ల మా వంటకాలకు బోలెడంత ప్రచారం వచ్చింది.

**ఉద్యోగులకు విమానయోగం! ...**

పిండి వంటల తయారీ అంతా చాలాకాలం వరకు ఇంటి పట్టునే కొనసాగించాం. ఆస్ట్రేలియాలో ఎంబీఏ చేసిన నా మనవడు రాంగోపాల్ నిరుడు సంక్రాంతి సెలవులకు ఇంటికొచ్చినప్పుడు, కస్టమర్లకు సమయానికి వంటకాలను అందించడానికి మేము పడుతున్న అవస్థ గమనించాడు. మురుకులు, కారప్పూస తయారీ మిషన్లను తెప్పించాడు. సకినాల పిండి కలిపేందుకు, చిప్స్ కోసం ఆలుగడ్డ తరిగేందుకు, పల్లీలు రాకేందుకు యంత్రాలు కొనుగోలు చేశాడు. విదేశాల్లో ఉద్యోగ అవకాశం వచ్చినా వెళ్లకుండా, మా వ్యాపారాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నాడు. నా మనవడి చొరవతోనే ఇంట్లో మొదలైన అప్పాల తయారీ ఇప్పుడు నాచారంలో చిన్న పరిశ్రమ స్థాయికి ఎదిగింది. మా దగ్గర వందమందికి పైగా ఉద్యోగులున్నారు. వారికి రోజూ మధ్యాహ్న భోజనం, ప్రతి పండుగకు బోనస్, కొత్త దుస్తులు ఇస్తున్నాం. ఏడాదికి ఒకసారి వారందరినీ యాత్రలకు తీసుకెళుతుంటాను.

అలా గత ఏడాది ఉద్యోగులను విమానంలో తిరుపతి తీసుకెళితే... వారి ఆనందం మాటల్లో చెప్పలేనిది. నన్ను వారంతా 'పెద్దమ్మ' అని ఆప్యాయంగా పిలుస్తారు. అలా పిలిపించుకోవడమే నాకు ఇష్టం. వారికి ఏ కష్టం వచ్చినా, సాయం అందిస్తుంటాను. మా ఉద్యోగులు కూడా సంస్థను తమదిగానే భావించి పని చేస్తుంటారు.

**కష్టాలను దాటి...**

జీవితమన్నాక కష్టసుఖాలు, వ్యాపారమన్నాక లాభ నష్టాలు లేకుండా ఉండవు కదా! పిండి వంటల వ్యాపారమనగానే చాలామందికి లాభమే కనిపిస్తుంది. దాని వెనుక ఎంతో చాకిరీ ఉంటుంది. ఇక నష్టం సంగతి చెప్పక్క ర్లేదు. ఒక్కోసారి పచ్చళ్లు పాడవుతుంటాయి. పిండివంటలు మిగిలిపోతాయి. అప్పుడు వాటన్నింటినీ చెత్తలో పడేయాల్సిందే. మరికొన్ని సందర్భాల్లో ఆర్డర్లు చివరి

నిమిషంలో క్యాన్సిల్ చేస్తుంటారు. ఒక్కొక్కరు రుచి సరిగ్గా లేదని వంకలు పెడుతుంటారు. అప్పుడు మళ్లీ ఫ్రెష్‌గా ఇవ్వడం లేదా డబ్బులు తిరిగి ఇచ్చేయడమో చేస్తుంటాం. ఆహార పదార్థాల ధరలు అమాంతం పెరుగుతాయి. అలాంటప్పుడు ఒకేసారి మేము ధర పెంచలేము కదా. ఇలా ఒకటా రెండా... బోలెడు సమస్యలుంటాయి. వాటన్నిటినీ దాటి ఇక్కడి వరకు వచ్చాను.

నా విజయ రహస్యం అంటే... నా కుటుంబ సహకారమే. నాకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు. నా కోడలు రేణుక నాకు మొదటి నుంచి అండగా ఉంటోంది. తెలంగాణలోని '50మంది స్ఫూర్తిదాయక మహిళల' జాబితాలో నాకూ స్థానం దక్కడం ఆనందంగా ఉంది. మాస్టర్ షెఫ్ కునాల్ కపూర్ పచ్చళ్ల తయారీపై నాతో స్పెషల్ షో చేయించారు. 'కష్టపడి పని చేయాలి. తద్వారా మరొకరికి మేలు కలగాలి. ఆ తర్వాతే ఫలితం ఆశించాలి' అనేది నేను నమ్ముతాను. అదే ఇప్పటి వాళ్లకు చెబుతాను. ఇవాల్టికీ ఖాళీగా మాత్రం కూర్చోను. రోజూ ఇంట్లో వంటతో పాటు దుకాణంలో నాలుగు గంటలైనా పని చేస్తుంటాను. అలా పని చేయబట్టే ఆరోగ్యంగా ఉన్నాను.

**రాజీలేని నాణ్యత ... అదే విజయ రహస్యం!**

'మేం ఎంతగా ప్రయత్నించినా మా ఇళ్లల్లో వండిన వాటికి మీ దుకాణంలోని అప్పాలంత రుచి రావడం లేదు. మీరేమైనా కలుపుతారా? ఆ రహస్యమేంటో మాకూ చెప్పచ్చు కదా" అని తెలిసినవాళ్లంతా నన్ను అడుగుతుంటారు. మేము ఇంట్లో చేసుకొనే పద్ధతిలోనే మా స్వగృహ ఫుడ్స్‌లోనూ తయారు చేస్తాం. కనీసం పచ్చళ్ల నిల్వకోసం కూడా ఏమీ కలపం. ఒక వంటకానికి వాడిన నూనెను మరొకదానికి ఉపయోగించం. సకినాలు, మురుకులు ఇలా ప్రతి వెరైటీకి వేర్వేరు మూకుడులు వాడతాం. పల్లీలు, నువ్వులు, పప్పులు లాంటి ఆహార పదార్థాల నాణ్యత విషయంలో రాజీపడం. అందుకే రుచిగా ఉంటాయి. అంతకు మించిన రహస్యం మరేమీ లేదు.

**మేనకాగాంధీకి పచ్చళ్లు...**

నేను వండిన అప్పాలంటే చాలా మందికి ఇష్టం. శుభకార్యాలు, పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాలప్పుడు సినిమా, రాజకీయ నాయకులు మా పిండి వంటలు తీసుకెళతారు. హీరో విజయ్ దేవరకొండ మొన్న దీపావళికి సకినాలు, సర్వ పిండి, అరిసెలు మా దగ్గరే చేయించు కున్నారు. రాజకీయ నాయకులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు, మధుయాష్కి, బి.వినోద్‌కుమార్, చెన్నమనేని విద్యాసాగరరావు, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తదితర ప్రముఖుల ఇళ్లల్లోని శుభకార్యాలకు స్వీట్, హాట్ ఐటెమ్స్ మా దగ్గరే కొంటారు.

ఇందిరమ్మ కోడలు, రాజకీయ నాయకురాలు మేనకాగాంధీకి నా చేతి పచ్చళ్లంటే చాలా ఇష్టం. గోనె ప్రకాశరావు ఆమె కోసమే నాతో ప్రత్యేకంగా చింతకాయ, పండు మిరప పచ్చళ్లు పెట్టించేవారు. విజయశాంతి కూడా నా వంటలను రుచి చూసి 'చాలా బావున్నాయి' అని మెచ్చుకొన్నారు.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

■

## ఐరన్ లోపాన్ని చక్కదిద్దే ఆహారపదార్థాలు

- ఐరన్ కలిగిన ఆహార పదార్థాలను తినడం ద్వారా శరీరంలో ఐరన్ లోపాన్ని అధిగమించవచ్చు.
- తృణధాన్యాలు, చిక్కుళ్ళు, ఆకుకూరలు, నట్స్ వంటి పదార్థాల్లో ఐరన్ ఎక్కువగా ఉంటుంది.
- చికెన్, గుడ్లు, చేపలు వంటి వాటిలో ఐరన్ లభిస్తుంది.
- ఐరన్ ఉన్న ఆహారపదార్థాలతో పాటు విటమిన్ సి ఉన్న పదార్థాలను కూడా తినడం మంచిది. ఎందుకంటే విటమిన్ సి... శరీరం ఐరన్ ను గ్రహించుకునేలా చేస్తుంది.
- టీ, కాఫీ, వైన్, కాల్షియం అధికంగా ఉండే ఆహార పదార్థాలు శరీరం ఇనుమును శోషించుకోకుండా అడ్డుకుంటాయి. ఐరన్ లోపం ఉన్నప్పుడు ఈ ఆహారాలకు దూరంగా ఉండటం ఉత్తమం.

■

# 'అనంత' చిరుధాన్యాల పండుగ !

– గోపాలరాజు

ప్రపంచ చిరుధాన్యాల సంవత్సరం సందర్భంగా అనంతపురం జిల్లాలోని 20 స్వచ్ఛంద సంస్థలు కలసి అనంతపురం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల మైదానంలో 2024 జనవరి 20 నుండి 22 వ తేదీ వరకు 'అనంత చిరుధాన్యాల పండుగ'ను నిర్వహించాయి. అనంతపురం జిల్లా రైతులు, నగరవాసులు, చిరుధాన్యాలు యిష్టమైనవారు రోజూ దాదాపు వెయ్యిమంది పాల్గొన్నారు.

ఈ పండుగను ఆర్‌డిటి డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ గారు, ఎఎఫ్ఇసి డైరెక్టర్ డా. వై. వి.మల్లారెడ్డిగారు మొదటిరోజున




ప్రారంభించారు. నగర మేయర్, మదనపల్లె నుండి ప్రకృతివనం ప్రసాద్‌గారు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం ప్రిన్సిపల్ సైంటిస్ట్ సహదేవరెడ్డిగారు, సాక్షి సీనియర్ జర్నలిస్ట్ పంతంగి రాంబాబుగారు, కె. వి. కె శాస్త్రవేత్త డా. హేమ కుమార్‌గారు, సి. సి. డి. డైరెక్టర్ శ్రీ లోకనాధ శాస్త్రిగారు, జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరిగారు, జిల్లా ఉద్యానశాఖ అధికారి రఘునాధరెడ్డిగారు చిరుధాన్యాల పండుగగూర్చి, ఉత్పత్తులు, ప్రాసెసింగ్, విలువ జోడింపు, మార్కెటింగ్, వినియోగం గూర్చి వివరించారు.



చిరుధాన్యాల పంటలైన సామలు, పరిగెలు, ఊదర్లు, అరికెలు, కొర్రలు, అండుకొర్రలు, జొన్నలు, సద్దలు, రాగులు మొదలగునవి వాతావరణ మార్పులు తట్టుకొని, అతి తక్కువ వర్షపాతంలో కూడా, తక్కువ పెట్టుబడితో సమృద్ధిగా పండుతాయి. నిరంతరం కరువుతో, నీటి కొరతతో తపించే అనంతపురం జిల్లా రైతులు చిరుధాన్యాలను సాగుచేసి, ఆర్థిక భద్రతను, ఆహారభద్రతను పొందవచ్చు.

గోధుమలు, ఓట్స్, వరి కంటే చిరుధాన్యాలలో పోషక విలువలు, పీచుపదార్థం (ఫైబర్), ఖనిజ లవణాలు, మాంసకృత్తులు అధికంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

చిరుధాన్యాలతో తయారుచేసిన పదార్థాలను తినడం ద్వారా శరీరానికి అవసరమైన పోషకాలు లభించి డయాబెటిస్, బిపి, థైరాయిడ్ వంటి జీవనశైలి సంబంధిత వ్యాధులు రాకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. రసాయన రహిత సహజ వ్యవసాయ పద్ధతులతో పండించిన ఈ పంటలను తినడం వలన పరిపూర్ణమైన ఆరోగ్యంతో జీవించవచ్చు.

ఈ పండుగలో చిరుధాన్యాల ఎగ్జిబిషన్, చిరుధాన్య ఉత్పత్తులఅమ్మకాలు ఏర్పాటు చేశారు. సందర్శకులకు కొత్త వంటకాలు రుచి చూపారు. ఏపిమాస్ ఏర్పాటుచేసిన పెద్దవడుగూరు మహిళా రైతు సంస్థ ఈ ఎగ్జిబిషన్‌లో స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ■

# ఈ కంది ఒక్కసారి వేస్తే ఆరేళ్ళు కాస్తుంది!


*సాధారణంగా కంది పంట ఒకసారే కోతకు వస్తుంది. కానీ నాలుగు నెలలకోసారి పంటను తెచ్చి మార్కెట్లో అమ్ముతున్నాడు శ్రీనాథ్. మొదట్లో అది కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసిన పంటేమో అనుకున్నాడు అతని స్నేహితుడు విజయ్. శ్రీనాథ్ నేరుగా పొలం నుంచే పంటను తీసుకొచ్చాడని తెలిశాక విజయ్ ఎంతగానో ఆశ్చర్యపోయాడు. నిజమే కదా.. మరి ఏడాదికి మూడుసార్లు కాసే ఆ వెరైటీ కంది పంట ఏంటో మనం కూడా తెలుసుకుందామా...*

**కం**ది సాధారణంగా మెట్ట భూమిలో పండుతుంది, మాగాణి గట్ల మీదా వేస్తారు కొందరు. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా తట్టుకునే కందిని జూన్–జులై నెలల్లో నాటితే డిసెంబరు, జనవరికి కాయ ఎండి కోతకు వస్తుంది. కొన్నిసార్లు కాయ లావుగా ఊరితే.. పచ్చి కాయలనే మార్కెట్‌కు తరలిస్తుంటారు. ఇది అరుదుగానే జరుగుతుంది.

పంట అంతా అయ్యాక భూమిలోని మొదళ్లను తొలగించడానికి దున్నించడమో, కూలీలతో తీసేయించడమో చేయాలి. అది ఖర్చుతో కూడుకున్న పని. అలా పొలాన్ని శుభ్రం చేశాక మరో పంట వేసుకుంటారు ఎవరైనా. అయితే, ఒక్కసారి వేస్తే ఆరేళ్ల పాటు ఏడాదికి మూడుసార్లు కోతకు వస్తుంది 'పెరెన్నియల్ రెడ్ గ్రామ్'. అంటే బహు వార్షిక కంది పంట అని అర్థం.

**తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం**

ఆరేళ్ల పాటు ఏటా విత్తనాలు కొనుగోలు చేయాల్సిన, పొలం శుభ్రం చేయించాల్సిన అవసరం రాదు ఈ పెరెన్నియల్ కంది రకంతో. దాంతో పెట్టుబడి ఖర్చు చాలావరకూ ఆదా అవుతుంది. శ్రీలంకకు చెందిన ఈ కందిలో కొలంబో రకం కూడా ఉంది. విత్తనాల సైజు, రంగు మాత్రమే మార్పు ఉంటుంది. పెరెన్నియల్ కందులు లావుగా, మచ్చలతో ఉంటాయి. అందుకే సాధ్యమైనంత వరకు పచ్చి కాయకే ఎక్కువ డిమాండ్ ఉంటుంది. ఈ గింజల్ని సలాడ్లు, సూపులూ, కూరల్లోకి వాడతారు. ఎండిన కాయలనుంచి వచ్చే పప్పు పోషకాలతో కూడి ఉంటుంది. ఈ రకం కంది మొక్క ఎక్కువ కొమ్మలతో గుబురుగా పెరిగి – గుత్తులు గుత్తులుగా విరగ కాస్తుంది. మామూలు కంది ఎకరానికి నాలుగు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడినిస్తే, పెరెన్నియల్ రకం పదమూడు నుంచి పదహారు క్వింటాళ్ల పంటను అందిస్తుంది. ప్రతి నాలుగు నెలలకోసారి కాయ ఎండి పోయాక కొమ్మల వరకూ కత్తిరిస్తారు. అప్పటికే ఏపుగా పెరిగిన మొక్కకు కొత్త కొమ్మలు వచ్చి మళ్లీ వెంటనే పూత పూసి కాయ కాస్తుంది. దాంతో వెంట వెంటనే పంట చేతికి వస్తుంది.



అలానే ప్రతి కాతకీ ఫలసాయం పెరగడం మరో విశేషం. నీటి ఎద్దడిని కూడా తట్టుకోగల ఈ రకం కందిని... నీళ్లు నిలవని మెట్ట పొలాల్లోనూ, చౌడు నేలల్లోనూ సాగు చేయడం మంచిది. ప్రతి పది పదిహేనురోజులకోసారి నీళ్ళు పెడితే సరిపోతుంది. వేసవిలో వారానికోసారి పెట్టాల్సి ఉంటుంది. కేవలం పూత నిలవడానికే కొన్ని రసాయనాల పిచికారీ అవసరం అవుతుంది.

కందిని ప్రధాన పంటగా ఎంచుకునేవారు పెరెన్నియల్ రకాన్ని సాగు చేసి అంతర పంటల్ని వేసుకుంటే ఎంతో లాభసాటిగా ఉంటుంది. ఈ రకాన్ని మధ్యప్రదేశ్, కర్ణాటకల్లోనూ, తెలుగు రాష్ట్రాల్లో నల్గొండ, కడప ప్రాంతాల్లోనూ, ఎక్కువగా సాగు చేస్తున్నారు.

(ఈనాడు సౌజన్యంతో)

# నాడు సాధారణ కూలీ ... నేడు పెద్ద కంపెనీ సి ఇ ఓ !

టెన్త్ పాస్ అయ్యాక పెళ్లి చేశారు. ఉమ్మడి కుటుంబానికి తోడైన పేదరికం, జీవితం అక్కడితో ఆగిపోయింది. కానీ జ్యోతిరెడ్డి ఆగిపోవాలని అనుకోలేదు. కొత్త ప్రయాణం మొదలుపెట్టారు. అది ఎక్కడి దాకా అంటే, అమెరికాలో ఓ సంస్థను ఏర్పాటు చేసి అక్కడి వారికి ఉద్యోగాలిచ్చే దాకా. ఈ సుదూరప్రయాణంలో ఎన్నో ఒడిదొడుకులు, మరెన్నో మైలురాళ్లు,

దూదిపాల జ్యోతిరెడ్డి 1970లో తెలంగాణ రాష్ట్రం, వరంగల్ సమీపంలోని నర్సిమూలగూడెంలో ఒక పేద కుటుంబంలో జన్మించారు. ఇంట్లో చదివించడానికి స్థోమత లేక జ్యోతిరెడ్డితో పాటు వాళ్ల చెల్లిని ఓ సెమీ ఆర్ఫాన్ స్కూల్లో జాయిన్ చేశారట, “పిల్లలకు అమ్మ లేదని మా నాన్న అబద్ధం చెప్పారట. ఈ అబద్ధాన్ని ఆరేళ్లు మోసానని ఆమె అన్నారు. అమ్మ అనే పదం చెప్పడానికే భయపడుతూ గడిపారట. అప్పట్లో ఆ ఆర్ఫాన్ స్కూల్‌లో ఉండలేక జ్యోతిరెడ్డి, వాళ్ల చెల్లి తిరిగి ఇంటికి వెళ్లిపోయారట. ఎలాగోలా టెన్త్ పూర్తి చేశారు. ఆ స్కూల్ పరిస్థితులే తాను జీవితంలో ఈ స్థాయికి రావడానికి కారణమయ్యాయని చెప్పుకొచ్చారు. ఆ సంఘర్షణ, జీవితాంతం కొనసాగేలా చేసిందని అన్నారు.



**తెలిసిన వాళ్ల అబ్బాయితో వివాహం**

చదువుకుంటానని ఎంత మొత్తుకున్నా ఇంట్లో పెద్దోళ్లు వినలేదు. ఇంటర్మీడియెట్ జాయిన్ అయినా పట్టించుకోకుండా పెళ్లి చేసేసారు, ఇద్దరు పిల్లలు, ఉమ్మడి కుటుంబానికి తోడైన పేదరికం, ఈ పరిస్థితుల్లో రోజూ వ్యవసాయం పనులకోసం పొలానికి వెళ్లడమే జ్యోతి రెడ్డి దినచర్య. సాయంకాలానికి ఇంటికి చేరి పిల్లలతో గడపడమే తెలుసు. ఆ తర్వాత ఉమ్మడి కుటుంబం వేరుపడింది,

“నా భర్త అన్ని పనులు నన్నే చూసుకోమని బాధ్యతల నుంచి తప్పుకున్నారు”. చంటి పిల్లలతో ఇంటి బాధ్యత ఎత్తుకున్న జ్యోతిరెడ్డికి నెహ్రూ యువ కేంద్ర అనే ఓ స్వచ్ఛంద సంస్థ ద్వారా దారి కనపడింది. ఆ సంస్థ పల్లెల్లో నైట్ స్కూళ్లు ఏర్పాటు చేసింది. దాంట్లో టీచర్‌గా అవకాశం వచ్చింది. అప్పుడు జ్యోతిరెడ్డి జీతం నెలకి 120 రూపాయలు. ఆ తర్వాత అదే సంస్థలో ప్రమోషన్, ఉన్న ఊరు మారాల్సి వచ్చింది. జ్యోతిరెడ్డి కుటుంబం హన్మకొండకు వెళ్లిపోవాల్సి వచ్చింది. కానీ ఈ మార్పు ఆమె భర్తకు నచ్చకుండానే జరిగింది.

హన్మకొండ నుంచి వేరువేరు ఊళ్లకు ప్రయాణించడంలో తన జీవిత ప్రయాణం వెతుక్కున్నారు జ్యోతి. అప్పుడే ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ పాసయ్యారు. ఆ తర్వాత టీచర్ ఉద్యోగం వచ్చింది. జీవితంలో పెద్ద మార్పంటూ వచ్చింది అక్కడే. ట్రెయిన్లో చీరలు అమ్మారు. స్కూల్ టీచర్‌గా తన కెరీర్ కొనసాగించారు. హఠాత్తుగా అమెరికా అవకాశం, అమెరికా నుంచి తెలిసిన వాళ్ల అమ్మాయి హన్మకొండ వచ్చారు. తాను అమెరికాలో నెట్టుకురాగలనా అని ఆమెతో జ్యోతిరెడ్డి అడిగారట. ఎందుకు కాలేరని ఆమె చెప్పిన మాటలు జ్యోతిరెడ్డి జీవితాన్ని మార్చేసింది.

“అమెరికా వెళ్లాలి, కానీ ఎలా? కనీసం కంప్యూటర్ నాలెడ్జి లేదు,” అప్పటికే టైపింగ్ నేర్చుకున్న జ్యోతి, కంప్యూటర్ పాఠాలు నేర్చుకున్నారు.

హైదరాబాద్ లోని హిమాయత్‌నగర్‌లో కంప్యూటర్ కోర్స్‌లో జాయిన్ అయ్యారు. పాస్ పోర్ట్ కూడా అప్లై చేశారు. అమెరికా వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. మనం ప్రయత్నం చేస్తే దేవుడు అవకాశం ఇస్తాడనేది తాను నమ్ముతానని చెమ్మగిల్లిన కళ్లతో అన్నారామె. కానీ మొదటిసారి వీసా రిజెక్ట్ అయింది. ఇదెంతో బాధ పెట్టిందట.

బలహీనతకు పరిష్కారం దాన్ని తలచుకుని కుమిలిపోవడం కాదు, బలాన్ని పెంచుకోవడమే

ప్రయత్నంలో లోపం లేదు కనక మరోసారి ప్రయత్నించడంలో తప్పులేదని అనుకున్నారు.




"విజిటింగ్ వీసాలో అమెరికా వంవడానికి తెలిసినవాళ్లు ఒప్పుకున్నారు," జ్యోతి నేను జీవితంలో ఎవరికైనా రుణపడి ఉన్నానంటే అది శ్రీకాంత్ అన్నయ్యకే" అంటారామె. ఆయనే లేకపోతే తాను అమెరికా వచ్చుండే దాన్ని కాదని అన్నారామె. ప్రతికూల పరిస్థితుల్లో తనకు ఎవరో ఒకరు సాయం చేశారు. అది వాళ్లకి చిన్నది కావొచ్చు. కానీ తన విషయంలో అది ఎంతో గొప్పదని అంటారామె.

**క్యాసెట్ షాప్ లో మొదటి ఉద్యోగం**

అమెరికా అయితే చేరుకున్నారు కానీ ఏం పని చేయాలి? ఇప్పటివరకూ పడిన కష్టం ఒక ఎత్తయితే, అమెరికాలో మొదటి నుంచి జీవితం ప్రారంభించడం మరో ఎత్తు. క్యాసెట్ షాప్‌లో సేల్ గాళ్‌గా జాయిన్ అయ్యారు. రోజుకి 5 డాలర్ల ఉద్యోగం, అలా జ్యోతి అమెరికా కెరీర్ ప్రారంభమైంది. ఆ షాప్‌కి వచ్చిన ఓ వరంగల్ ఎన్నారై ఆమెను చూసి మీరు టీచర్ కదా అని అడిగారు. మీరిక్కడ ఏం చేస్తున్నారు.. మీ స్కిల్‌కి ఇది తగిన ఉద్యోగం కాదని చెప్పేసి వెళ్లిపోయారు. అప్పుడు జ్యోతిరెడ్డి మనసులో సంఘర్షణ మొదలైంది.

కొన్ని రోజుల తర్వాత ఆ వ్యక్తి జ్యోతిరెడ్డికి ఫోన్ చేసి రిక్రూటర్ ఉద్యోగం ఉందని చేస్తారా అని అడిగారు. కానీ తనకి ఇంగ్లీష్ అంతగా రాదని ఆమె నిరాకరించారు. ట్రెయినింగ్ ఇస్తారని ఆయన కన్విన్స్ చేశారు. అలా రెండువేల డాలర్ల ఉద్యోగం విత్ అకామడేషన్. ఆ క్షణంలో తనకు పరిచయం అయిన ఓ తమిళ అమ్మాయి తన గురించి ప్రేయర్ చేసిందట. అది గొప్ప సాయం కాకపోవచ్చు. కానీ తనకోసం ఎలాంటి స్వార్థం లేకుండా ఆమె చూపించిన ఎఫెక్షన్ మర్చిపోలేనని అంటారు. జ్యోతిరెడ్డి.

**ఉద్యోగం తర్వాత వ్యాపారం**

సాఫీగా సాగుతున్న ఉద్యోగం, ఇంతలో 5 వేల డాలర్ల ఆఫర్. దీంతో నో చెప్పలేకపోయానని జ్యోతి అన్నారు. అప్పుడే ఓ బంపర్ ఆఫర్ వచ్చిందట. ఓ రిక్రూట్మెంట్ కంపెనీలో 50 శాతం షేర్ ఇస్తామన్నారు. కెరీర్‌లో నిలదొక్కుకుంటున్న క్షణంలో ఇలాంటి ఆఫర్ రావడం నిజంగానే గొప్ప విషయం. ఎలాంటి ఆలోచన చేయకుండా ఉద్యోగానికి రిజైన్ చేసి అక్కడకి వెళ్లిపోయారు.

సౌత్ కొరొలినా నుంచి వర్జీనియా బస్‌లో వెళ్లారు, ఏకంగా 27 గంటల జర్నీ. తీరా వెళ్లాక తెలిసింది. ఆ కంపెనీ వాళ్లు లాభాల్లో యాభై శాతం అన్నారు. దీంతో డీల్ వర్కవుట్ కాలేదు. అప్పటికి వర్జీనియాలో నెలకి 5వేల డాలర్ల ఉద్యోగం పోయి, ఇటు డీల్ జరక్క ఏం చేయాలో పాలుపోలేదట. ఇక ఆ తర్వాత ఉద్యోగ ప్రయత్నాలు ఫలించలేదు. జీవితం చీకట్లోకి వెళ్లిపోయింది. సేవింగ్స్ డబ్బులున్నాయి, కానీ చేయడానికి పని లేదు. ఒక్క క్షణంలో అమెరికాతో రుణం తెగిపోయింది. అమెరికా విడిచి పెట్టాల్సిన సమయం వచ్చిందేమో అనుకున్నారు. అప్పుడే పిల్లలు గుర్తొచ్చి ఇక్కడికి వచ్చారు. తిరిగి అమెరికా బయలుదేరినా ఏం పని చేయాలో అర్థం కాలేదు.

**ఫినిక్స్ ప్రారంభం**

ఇండియాలో తాను నమ్మే ఓ జ్యోతిష్యుడు వ్యాపారం కలసి వస్తుందని చెప్పడంతో కంపెనీ ప్రారంభానికి పనులు మొదలుపెట్టారు. అలా ఫీనిక్స్ మొదలైంది. ఆ తర్వాత తిరిగి చూసుకోలేదు. ఏటికేడు ప్రయాణం.. ఒక్కో మజిలీ దాటుతూ వచ్చింది. ఇప్పుడు ఫినిక్స్ మిలియన్ డాలర్ల కంపెనీగా అవతరించింది. ఇద్దరు పిల్లలకు పెళ్లిళ్లయ్యాయి, పూర్తిస్థాయి సేవ కార్యక్రమాలకు జ్యోతి టైం కేటాయిస్తున్నారు. ఆర్ఫాన్ స్కూళ్ల ఏర్పాటుపై పోరాటం చేస్తున్నారు. తనతో కలసి వచ్చేవారికి ఆహ్వానం పలుకుతున్నారు. కంపెనీ పెట్టిన తర్వాత ఎన్నో అవార్డులు, రివార్డులు వచ్చాయి. ఎన్నారై సంఘాల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది. "జీవితంలో ఎక్కడా కాంప్రమైజ్ కాలేదు, సక్సెస్ అయ్యాను, అంతకంటే ఈ గుర్తింపులు, అవార్డులు విలువైనవి కావని ముగించారు జ్యోతిరెడ్డి".

(యువర్ స్టోరీ డాట్ కామ్ సౌజన్యంతో )

■

# వ్యవసాయ భూముల లావాదేవీల్లో కొత్త విప్లవం !

**నేను** వ్యవసాయాధారిత కుటుంబం నుంచి వచ్చాను. మాకు అదే జీవనం. మా తండ్రి ఒకసారి మా వ్యవసాయ భూమిని విక్రయించాలి అనుకున్నప్పుడు చాలా ఇబ్బందులు పడ్డారు. సదరు భూమికి మంచి విలువ ఉన్నప్పటికీ కొనుగోలుదార్లను చేరడం చాలా కష్టమైంది. అప్పుడు నాకు వచ్చిన ఈ ఆలోచనే ఆన్ లైన్ మార్కెట్ ప్లేస్ రూపకల్పనకు కారణమైంది. కొనుగోలుదార్లు, అమ్మకందార్లను కలిపాలని అప్పుడే నిర్ణయించుకున్నా" అంటారు దేశంలో మొదటి వ్యవసాయ భూముల మార్కెట్ ప్లేస్ అయిన ఎస్ ఫార్మ్స్ ఇండియా సీఈఓ, కో ఫౌండర్ కామేష్ ముప్పరాజు.



ఎస్ ఫార్మ్స్ ఇండియా సంస్థ కామేష్ 2018లో స్థాపించారు. కొనుగోలుదార్లను, భూ యజమానులతో అనుసంధానించే వేదిక ఉద్దేశంతో దీన్ని ప్రారంభించారు. ఎస్ఫర్స్ ఇండియా వివిధ అంశాలను క్రోడీకరించి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ ఆధారంగా సమాచారాన్ని ఉపయోగించుకుని భూములకు సరైన విలువ కట్టడం వల్ల ఇది బయర్స్, సెలర్స్కు పూర్తి స్థాయిలో ఉపయోగపడ్తోంది.

"దేశంలో వ్యవసాయ భూముల ధరలు పెరుగుతున్నాయి. అదే సమయంలో కొనుగోలు, అమ్మకందారు మధ్య అగాధం కూడా విస్తృతమవుతోంది. భూవిక్రయదారులు అంతా అధిక శాతం గ్రామాల్లో ఉంటే, కొనాలని అనుకునే వాళ్లంతా నగరాలు, పట్టణాల్లో నివసిస్తూ ఉంటారు. ఈ సమస్యకు పరిష్కారాన్ని సూచించి, ఇద్దరినీ అనుసంధానించడమే మా ఆలోచన" అంటారు కామేష్.

రియల్ ఎస్టేట్ రంగంలో డిజిటలైజేషన్ సరికొత్త ఒరవడి. గృహ, వాణిజ్య ఆస్తుల కొనుగోలు, అమ్మకం కోసం ఇప్పటికే అనేక ఆన్ లైన్ ప్లాట్ఫామ్స్ ఉన్నాయి, అయితే అగ్రి రియాల్టీలో ఇంకా ఎవరూ గుర్తించని విస్తృత అవకాశాలున్నాయి. ప్రతీ రోజూ పెద్ద సంఖ్యలో వ్యవసాయ భూముల లావాదేవీలు కొనసాగుతున్నా, అందులో 95 శాతం మధ్యవర్తుల ద్వారా సాగుతున్నవే. అయితే ఇంటర్నెట్ ఇప్పుడు మారుమూల ప్రాంతాల్లోకి కూడా చొచ్చుకుపోవడం వల్ల అగ్రి రియాల్టీ రంగంలో అనూహ్య మార్పులను చూడొచ్చు. వినూత్న పరిష్కార మార్గాలు భారతీయ వ్యవసాయ రంగాన్ని మార్చే సామర్థ్యం అగ్రిరియాల్టీకి ఉందని బలంగా నమ్ముతారు కామేష్. ఈ రంగంలోకి మొదటగా వచ్చిన నేపథ్యం అనుభవంతో ఆయన ఈ విషయాన్ని బలంగా నమ్ముతున్నారు.

ఆరోగ్యంలో ఫార్మ్ ఫ్రెష్ ఫుడ్ (తాజా ఆహారం) ప్రధాన పాత్ర పోషిస్తుందనే నమ్మకంతో ముఖ్యంగా హై నెట్ వర్త్ ఇండివిద్యుయల్స్ నుంచి వ్యవసాయ భూముల కోసం మంచి గిరాకీ ఏర్పడ్తోంది. సహజ ఉత్పత్తులపై జనాల్లో అవగాహన పెరగడంతో పాటు వినియోగదారు ఆలోచన సరళిలో కూడా మార్పులు రావడం అగ్రి రియాల్టీకి బలం చేకూరుస్తోంది.

వ్యవసాయ భూములను కనుగొని, కొనుక్కునే వేదికగా ఎట్ఫార్మ్స్ ఇండియాను తీర్చిదిద్దారు. ఎలాంటి ఛార్జీలు లేకుండా విక్రేతలు తమ భూములను ఈ వెబ్ సైట్లో నమోదు చేసుకోవచ్చు. అవసరమైన సమాచారాన్ని నింపడంతో పాటు ఫోటోలను జత చేయాల్సి ఉంటుంది. లేకపోతే వాట్సాప్ ద్వారా సదరు సమాచారాన్ని ఎస్ ఫార్మ్స్ ఇండియా ప్రతినిధులకు అందజేసినా సరిపోతుంది. ఎలాంటి భూమి కావాలి ఏ రాష్ట్రం, ఏ జిల్లాలో కావాలి అనే వివరాల ఆధారంగా కొనుగోలుదార్లు ఈ వేదిక ద్వారా భూములను శోధించి గుర్తించవచ్చు.

ఎస్ ఫార్మ్స్ ఇండియా నమ్మకమైన చిన్న వ్యవసాయ డెవలపర్స్తో భాగస్వామ్యం కుదుర్చుకుంది, కొంతమంది డెవలపర్స్ భూ విక్రయమైన తర్వాత కూడా ఐదేళ్ల పాటు

వాటిని నిర్వహించే బాధ్యతను తీసుకోవడంతో నగరంలో ఉన్న చాలామంది ప్రొఫెషనల్స్ ఇలాంటి భూములపై ఆసక్తిని కనబరుస్తున్నారు. ప్రత్యామ్నాయ పెట్టుబడిగా భూముల కొనుగోలు కేవలం హై నెట్‌వర్క్ ఇండివిద్యుయల్స్‌కు మాత్రమే అనే రోజులు మారిపోతున్నాయి. మిడిల్ క్లాస్ వాళ్లకు, ఉద్యోగస్తులకు (వైట్ కాలర్ ప్రొఫెషనల్స్) కూడా వ్యవసాయ భూములను పెట్టుబడి సాధనంగా మార్చే విధంగా ఎస్‌ఫార్మ్స్ ప్రణాళిక సిద్ధం చేసింది అంటారు కామేష్ లివైవిధ్యానికి మారుపేరు! ఇంతవరకూ ఎవరూ పెద్దగా దృష్టి సారించని వ్యాపారంలో విభిన్నమైన ప్రోడక్టును నిర్మించడం అంత సులువేం కాదు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా కామేష్ ప్రయాణం ఎన్నో సవాళ్లను విసిరింది. కేవలం ఆంత్రప్రెన్యూర్ మాత్రమే ధైర్యంగా ఎలాంటి పరిస్థితులను ఎదుర్కోవడానికైనా ముందుకు సాగుతారు అంటారు.

"వ్యవసాయాన్ని, రియల్ ఎస్టేట్‌ను మిళితం చేస్తూ ఓ సంస్థను నిర్మించడానికి ఎంతో ఓర్పు, పట్టుదల కావాలి. ఈ వేదికలోకి జనాలను తీసుకువచ్చే ముందు వారికి వివిధ అంశాలపై అవగాహన కల్పించడం అన్నింటికంటే పెద్ద సవాల్" అంటారు కామేష్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పటిష్టమైన ఫ్రీలాన్స్ నెట్వర్కు ఏర్పాటు చేసుకుంది ఎట్ఫార్మ్స్ ఇండియా. ప్రస్తుతం వెబ్ సైట్లో నగరాల చుట్టుపక్కల ఉన్న వ్యవసాయ భూములను లిస్ట్ చేస్తున్నారు. కోరా, యూట్యూబ్ వంటి డిజిటిల్ ప్లాట్ఫామ్స్ ద్వారా మరింత అవగాహన పెంచే ప్రయత్నం చేస్తోంది ఈ సంస్థ. "కోరా అనే డిజిటల్ వేదిక ద్వారా జనాలకు వ్యసాయ భూముల లావాదేవీల గురించి విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నాం. వీటికి వస్తున్న స్పందనను చూస్తే.. మేం సరైన దారిలోనే ప్రయాణిస్తున్నాం" అని అనిపిస్తోంది అంటారు కామేష్

హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా సేవలను అందిస్తున్న ఎస్ ఫార్మ్స్ ఇండియా ప్లాట్‌ఫాంలో ఇప్పటికే 21 వేల మంది బయర్స్, సెలర్స్ ఉన్నారు. వార్షికంగా 220 శాతం వృద్ధితో లిస్టింగ్స్ సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాలకు సంబంధించినవే సుమారు 5000 వ్యవసాయ భూముల లిస్టింగ్స్ సైట్లో ఉన్నాయి. 2021 పూర్తయ్యే నాటికి కామేష్ అండ్ టీమ్ తమ సేవలను తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రలకు విస్తరించాలని చూస్తోంది. ఈ ఏడాది మరిన్ని కొత్త ప్రోడక్టులను తీసుకురావాలనే తపనతో పని చేస్తోంది ఎస్ఫోర్మ్స్ ఇండియా.

వ్యవసాయ ఆధారిత పారిశ్రామికవేత్తలకు (అగ్రి ఎంట్రప్రెన్యూర్స్) ఉపయోగపడే విధంగా త్వరలో ఆగ్రో ఇండస్ట్రీ భూముల సేవలను కూడా ప్రారంభించబోతోంది ఈ సంస్థ. దీనివల్ల ఆగ్రో ప్రాసెసింగ్ క్లస్టర్లు, మెగా ఫుడ్ పార్క్ల ఏర్పాటు చేయాలని అనుకునే వాళ్లకు భూముల గుర్తింపు, కొనుగోలు సులువవుతుంది. ఇక టెక్ యుగమే! ప్రైస్ ప్రెడిక్షన్ మోడల్ (ధరలను ఊహించగలిగే సామర్థ్యం)ను టాప్ మేనేజ్మెంట్ సంస్థలతో కలిసి ఎస్ ఫార్మ్స్ ఇండియా రూపొందిస్తోంది. వివిధ పారామీటర్ల ఆధారంగా అగ్రి రియాల్టీ డేటాను సమీకరించి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నిక్స్ ఈ మోడల్ను రూపొందిస్తోంది.

"వ్యవసాయ భూములకు రుణాలు ఇప్పించేందుకు ఆర్థిక సంస్థలతో, భూ–నీటి నిర్వాహణ కోసం విదేశీ సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంటున్నామంటారు" కామేష్ అగ్రి భూముల ఆన్ బోర్డింగ్, రియల్ టైంలో ఆదాయాన్ని తెలుసుకునేందుకు ఫ్రీలానర్స్ కోసం అత్యంత సులువైన ఇంటర్ఫేజ్, డాష్ బోర్డ్ రూపొందించామని చెప్తారు కామేష్ రియల్ టైమ్ పద్ధతితో అత్యంత తక్కువ భూమిని కూడా కొనుగోలు, అమ్మకం చేసే విధంగా ల్యాండ్ ఫ్రాక్షన్ ట్రేడింగ్ ప్లాట్ఫామ్నుఎస్ఫార్మ్స్ ఇండియా సిద్ధం చేస్తోంది. "ల్యాండ్ టైటిల్ యాక్ట్ అమలు కోసం వేచి చూస్తున్నాం. ఇది అమల్లోకి వస్తే.. ఎకరాల్లో వెయ్యో వంతు (1/1000) భూమిని కూడా కస్టమర్లు కొనుగోలు, అ అమ్మకం చేసుకోవచ్చు" అంటారు కామేష్. భవిష్యత్ లక్ష్యాలు, ప్రణాళిక గురించి కామేష్ మాట్లాడుతూ. "మాకు స్పష్టమైన విస్తరణ వ్యూహం ఉంది. 2023నాటికి ప్రతీ పిన్ కోడ్లో ల్యాండ్ లిస్టింగ్స్ అందుబాటులోకి తీసుకురావడమే మా టార్గెట్" అంటారు.

(యువర్ స్టోరీ డాట్ కామ్ సౌజన్యంతో)

■

# మధుమేహానికి, పాము విషానికి దివ్య ఔషధపు మొక్క!

గ్రామీణ ప్రాంతాల్లో అనేక ఔషధ మొక్కలు పెరుగుతాయి. మధుమేహం, బీపీ వంటి వ్యాధుల చికిత్సలో దీన్ని ఉపయోగిస్తారు. గుజరాత్‌లో పెరిగే గుడ్మార్ కూడా అలాంటి మొక్కల్లో ఒకటి ప్రకృతి మనకు ఎన్నో రకాల ఔషధాలను ప్రసాదించింది. యోగా గురువు పతంజలి ప్రకారం.. మన చుట్టూ ఉన్న ప్రతి మొక్కకు ఔషధ గుణాలు ఉంటాయి, కానీ సమాచారం లేకపోవడం వల్ల అందరూ దాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. గుడ్మార్ అనే మొక్కలో కొన్ని ప్రత్యేకమైన ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. జానపద కథలు గుడ్మార్ షుగర్‌ను చంపేస్తుందని కూడా నమ్ముతారు. గుడ్మార్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. దీన్ని తీసుకోవడం వల్ల మహిళల్లో మధుమేహం, బీపీ, ఊబకాయం, కాలేయ వ్యాధి, చర్మ సంబంధిత సమస్యలు, పీసీఓడీ నుంచి ఉపశమనం లభిస్తుంది.

డాక్టర్ ప్రియాంక సింగ్ చెప్పిన దాని ప్రకారం.. గుడ్మార్ పురాతన కాలం నుండి ఉపయోగించబడింది. ఇది చాలా ప్రయోజనకరమైన ప్రభావవంతమైన ఔషధ మూలిక, ఇది షుగర్ని నియంత్రించడంతో పాటు అనేక తీవ్రమైన వ్యాధుల నుండి ఉపశమనం కలిగిస్తుంది

ఆయుర్వేద కాలం నుంచి ఈ ఔషధాన్ని భారతదేశంలో ఉపయోగిస్తున్నారని సింగ్ చెప్పారు. ఈ ఔషధం ముఖ్యంగా మహిళల్లో పాలిసిస్టిక్ ఓవరీ డిసీజ్ వంటి కొత్త తరం వ్యాధులలో చాలా ప్రభావవంతంగా ఉంటుంది.

గ్రామీణ ప్రాంతాల్లో, గుడ్మార్ను పాము– కాటుకు చికిత్స చేయడానికి కూడా ఉపయోగిస్తారు. పాము కాటుకు గురైన వ్యక్తికి గుడ్మర్ ఆకులతో చేసిన ద్రావణం పాము విషం యొక్క ప్రభావాన్ని తటస్థీకరిస్తుంది.

రక్తపోటు మరియు స్థూలకాయాన్ని నియంత్రించడంలో కూడా గుడ్మార్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. దీని ఆకుల పొడిని కొబ్బరికాయతో కలిపి పూస్తే చర్మ సంబంధిత వ్యాధులు నయమవుతాయి. కాలేయాన్ని కూడా ఆరోగ్యంగా



ఉంచుతుంది. ప్రతి ఔషధం మరియు మూలికలు ప్రయోజనాలతో పాటు దుష్ప్రభావాలను కలిగి ఉంటాయి, గుడ్మార్ అతిగా వాడటం వలన వణుకు, విశ్రాంతి లేకపోవటం, బలహీనత లేదా మైకము ఏర్పడవచ్చు. ■

## ఖాళీకడుపుతో ఖర్జూరం తింటే ఇన్ని లాభాలా ?

**మ**నం ఆరోగ్యంగా ఉండాలంటే శరీరంలో రోగ నిరోధక శక్తి చాలా ముఖ్యం. చక్కని ఆరోగ్యం, మనలో ఇమ్యూనిటీ పెరగాలంటే తప్పకుండా ఖర్జూరాలను ఆహారంలో భాగం చేసుకుంటే మంచిది. ఖర్జూరంలో ఫైబర్, కాల్షియం, మెగ్నిషియం, పొటాషియం, ఐరన్, యాంటీఆక్సిడెంట్లు ఇలా ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి చర్మం, మెదడు, ఎముకలు, జుట్టు ఆరోగ్యానికి దోహదపడతాయి.

- ఉదయం ఖాళీకడుపుతో ఒకటి లేదా రెండు ఖర్జూరాలు తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మలబద్ధకం, గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది.
- రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది.
- ఖర్జూరం శరీరంలోని కొవ్వును తగ్గించి గుండె ఆరోగ్యంగా ఉండేందుకు సహకరిస్తుంది.
- రక్తపోటు సమస్యను తగ్గిస్తుంది.
- ఎముకల పటుత్వాన్ని పెంచుతుంది.
- ఉదర సంబంధ వ్యాధులను ఈ పండ్లు అరికడతాయి.

# గణతంత్ర దినోత్సవంలో మెరిసిన నారీశక్తి !



**భా**రత 75వ గణతంత్ర వేడుకల్లో నారీ శక్తి వెల్లివిరిసింది. జనవరి 26న ఢిల్లీలో కర్తవ్య పథ్‌లో జరిగిన వేడుకలు మన సైనిక పాటవ ప్రదర్శనకు కూడా వేదికగా నిలిచాయి. దేశ ఘన సాంస్కృతిక చరిత్రకు అద్దం పట్టాయి. ఆర్మీ మిలిటరీ పోలీస్ విభాగానికి చెందిన కెప్టెన్ సంధ్య సారథ్యంలో తొలిసారిగా పూర్తిగా మహిళా సిబ్బందితో జరిగిన త్రివిధ దళాల కవాతు అందరినీ ఆకట్టుకుంది.

నేవీ, డీఆర్డీఓ శకటాలతో పాటు మణిపూర్, మధ్యప్రదేశ్, రాజస్తాన్, హరియాణా, ఒడిశా, జార్ఖండ్, ఛత్తీసగఢ్ వంటి పలు రాష్ట్రాల శకటాలు కూడా ఆసాంతం నారీ శక్తికి అద్దం పట్టేలా రూపొందాయి.

265 మంది మహిళా సిబ్బంది మోటార్ సైకిళ్లపై ఒళ్ళు గగుర్పొడిచేలా సాహసోపేత విన్యాసాలు చేశారు. సంప్రదాయ మిలిటరీ బ్యాండ్ స్థానంలో కూడా ఈసారి 112 మంది మహిళా కళాకారులు శంఖం, నాదస్వరాలతో పాటు గిరిజన , తదితర సంగీత వాయిద్యాలతో అలరించారు. బీఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ మొదలుకుని ఢిల్లీ పోలీస్, ఎన్‌సీసీ వంటి పలు విభాగాల కవాతులన్నీ పూర్తిగా నారీమయంగా మారి అలరించాయి.

వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ వీటన్నింటినీ ఆసాంతం ఆస్వాదిస్తూ కన్పించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి ఆయన సంప్రదాయ గుర్రపు బగ్గీలో వేడుకలకు వచ్చారు. అనంతరం జరిగిన పరేడ్లో రాష్ట్రపతి ముర్ము, మేక్రాన్ త్రివిధ దళాల వందనం స్వీకరించారు. 90 నిమిషాలకు పైగా జరిగిన వేడుకల్లో ప్రధాని నరేంద్రమోదీ, రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో పాటు సైనిక దళాల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు. వణికించే చలిని, దట్టంగా కమ్మేసిన పొగ మంచును లెక్క చేయకుండా భారీ జనసందోహం వేడుకలను తిలకించింది.

ఈసారి ఏకంగా 75 వేల మందికి పైగా గణతంత్ర వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించారు. మోదీ వారితో కలివిడిగా మాట్లాడుతూ గడిపారు. ఫొటోలు, సెల్ఫీలకు పోజులిచ్చారు. ఆయన ధరించిన రంగు రంగుల బంధనీ తలపాగా ఆహూతులను ఆకట్టుకుంది. మోదీ రాక సందర్భంగా భారత్ మాతా కీ జై అంటూ వారు చేసిన నినాదాలతో కర్తవ్య పథ్ మారుమోగింది. ఫ్రాన్సుకు చెందిన 95 మంది సభ్యుల కవాతు దళం, 30 మందితో కూడిన సైనిక వాద్య బృందం కూడా వేడుకల్లో పాల్గొన్నాయి.

చివరగా వాయుసేనకు చెందిన 29 యుద్ధ విమానాలు, ఏడు రవాణా విమానాలు, 9 హెలికా ప్టర్లు, ఒక హెరిటేజ్ ప్లేన్తో పాటు ఫ్రాన్స్ వైమానిక దళానికి చెందిన ఎయిర్‌బస్ ఏ330 మల్టీ ట్యాంకర్ రవాణా విమానం, రెండు రాఫెల్ ఫైటర్ జెట్లు చేసిన ఒళ్లు గగుర్పొడిచే విన్యాసాలతో వేడుకలు ఘనంగా ముగిశాయి. ఈ విన్యాసాల్లో కూడా 15 మంది మహిళా పైలట్లు పాల్గొనడం విశేషం. ■

మనిషికి మనిషికీ మధ్య వుండే తారతమ్యం ఆత్మవిశ్వాసం వుండడం, ఆత్మ విశ్వాసం లేకపోవడం మాత్రమే

# తుపానుకు దెబ్బతిన్నా.. తిరిగి విరగ్గాసిన సేంద్రియ పత్తి!

'రసాయన మందులేమీ వాడకుండా సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో బీటీ హైబ్రిడ్ సీడ్ పత్తిని సాగు చేస్తూ అధిక దిగుబడి సాధిస్తున్నారు. రైతు ఏకుల లక్ష్మీనారాయణ. వ్యవసాయమే జీవనంగా బతుకుబండిని నడిపిస్తున్న లక్ష్మీనారాయణ తనకు కౌలుకు ఇచ్చిన భూ యజమాని కోటగిరి చైతన్య సూచనల మేరకు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లో బీటీ హైబ్రిడ్ విత్తన పత్తిని రెండేళ్లుగా సమర్థంగా సాగుచేస్తూ విశేషమైన దిగుబడులతో పాటు అధిక నికరాదాయం పొందుతున్నారు.'

లక్ష్మీనారాయణది ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం అన్నేరావుపేట. శివారు గ్రామమైన సీతారామపురంలో మూడెకరాల ఎర్ర నేలను మొత్తం రూ.60 వేలకు కౌలుకు తీసుకొని విత్తన పత్తిని రెండేళ్లుగా సాగుచేస్తున్నారు. ఒక ఎకరానికి డ్రిప్ వేశారు. రెండెకరాలకు నీటిని పారగడుతున్నారు. 120 రోజుల దశలో ఉన్న పత్తి మొక్కలన్నీ ఆరోగ్యంగా ఎదుగుతూ ఇంకా కొత్త చిగుర్లు వేస్తున్నాయి. మొక్కకు 90 నుంచి 110 వరకు కాయలతో చూపరులను ఆశ్చర్యపరుస్తు న్నాయి. తనకు 12 నుంచి 14 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని, ఖర్చులు పోగా నికరాదాయం రూ. 7 లక్షలకు తగ్గదని రైతు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



బెంగళూరులో సాఫ్ట్వేర్ ఇంజనీర్ గా పనిచేస్తున్న చైతన్య కరోనా కాలంలో ఇంటి దగ్గర వుండి సేంద్రియ సాగులో మెళకువలను పూర్తిగా ఆకళింపు చేసుకున్నారు. ఆవు పేడతో జీవామృతం, అనేక రకాల జీవన ఎరువులు కలిపి మగ్గబెట్టి ప్రత్యేకంగా రూపొందించిన ఎర్రి కంపోస్టును మూడెకరాల్లో దుక్కి 3 టన్నులు వేశారు. పత్తి విత్తిన 20 రోజులకు మరో 3 టన్నుల కంపోస్టును మొక్కల మొదళ్ల వద్ద వేశారు. లింగాకర్షక బుట్టలు, జిగురు అట్టలతో సమీకృత చీడపీడల యాజమాన్య మెళకువలు పూర్తిగా పాటిస్తున్నారు. పంచగవ్య, పుల్లటి మజ్జిగతోపాటు అగ్నిఅస్త్రం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, దశపర్ణి కషాయం తదితర కషాయాలను విడతల వారీగా లక్ష్మీనారాయణ సొంతంగా తయారుచేసుకుంటూ ఐదు రోజులకోసారి ఏదో ఒకటి అవసరాన్ని బట్టి పిచికారీ చేస్తున్నారు. దీంతో పత్తి మొక్కలు విత్తి 120 రోజులు అయి నప్పటికీ ఇంకా బలంగా ఎదుగుతున్నాయి. అంతేగాకుండా ఒక్కొక్క చెట్టుకు కాయలు కూడా అధిక సంఖ్యలో వచ్చాయి.

**నేలకొరిగినా తిప్పుకుంది!**

డిసెంబర్ మొదటి వారంలో వచ్చిన మిచాంగ్ తుఫానుకు మూడెకరాల్లోని పత్తి పంటంతా నేల వాలింది. దీంతో లక్ష్మీనారాయణ తీవ్రమైన ఆందోళనకు గురయ్యారు. ఏదైతే అది అవుతుందని.. పడిపోయిన మొక్కలను కూలీలతో లేపి నించోబెట్టి మొదళ్లలో మట్టిని వేయించారు. ఆ తర్వాత రెండు రోజులకే తోటంతా ఆశ్చర్య కరంగా నిలదొక్కుకుంది. వానపాములు నేలనుగుల్లగా ఉంచ టం, వేరువ్యవస్థ బలంగా, లోతుగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందని రైతు చెప్పారు. ఎంతో ఆరోగ్యంగా పెరుగుతున్న ఈ పంటను ఇటీవల పరిశీలించిన ప్రసిద్ధ వ్యవసాయ నిపుణులు దేవేంద్రశర్మ, డా. జీవీ రామాంజనేయులు, పాలాది మోహనయ్య తదితరులు లక్ష్మీనారాయణ కృషిని ప్రశంసించారు.

**3 ఎకరాల్లో విత్తన పత్తి సాగు: రూ. 7 లక్షల నికరాదాయం!**

3 ఎకరాల పొలంలో విత్తన పత్తి క్రాసింగ్ కోసం అరెకరంలో పోతు (మగ) మొక్కల్ని పెంచుతున్నాను. అంటే.. నికరంగా 2.5 ఎకరాల్లోనే పత్తి పంట ఉన్నట్లు లెక్క. చెట్టుకు సగటున 90–100 కాయలున్నాయి. మొదటి విడత పత్తి తీశాం. మరో మూడుసార్లు తీస్తాం. ఎకరానికి 12–14 క్వింటాళ్ల దిగుబడి వస్తుందనుకుంటున్నాం. కనీసం 30 క్వింటాళ్ల సీడ్ పత్తి వస్తుందనుకున్నా.. 18 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, 12 క్వింటాళ్ల దూది వస్తుందని లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. ■

మానవ జన్మ ప్రకృతిని జయించడానికే కాని, దానిని అనుసరించడానికో, అనుకరించడానికో కాదు

# ప్రపంచంలోనే అత్యంత తెలివైన విద్యార్థిగా ప్రీషా చక్రవర్తి



తొమ్మిదేళ్ల భారతీయ-అమెరికా (ఇండియన్ అమెరికన్) విద్యార్థిని ప్రీషా చక్రవర్తి ప్రపంచంలోనే అత్యంత తెలివైన విద్యార్థినిగా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించుకుంది. 90 దేశాలకు చెందిన 16 వేలమంది విద్యార్థులను ఓడించి ప్రీషా ఈ ఘనత సాధించింది. ప్రతిష్ఠాత్మక జాన్స్ హాప్‌కిన్స్ సెంటర్ ఫర్ టాలెంటెడ్ యూత్ (జేహెచ్-సీటీవై) ఈ మేరకు జాబితాను విడుదల చేసింది.

కాలిఫోర్నియా ఫ్రిమోంట్‌లోని వార్మ్‌స్ప్రింగ్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థిని అయిన ప్రీషా జేహెచ్-సీటీవై నిర్వహించిన సమ్మర్ 2023 గ్రేట్ 3 టెస్టులో ఈ రికార్డు అందుకుంది. స్కూల్ అసెస్‌మెంట్ టెస్ట్ (ఎస్ఏటీ), అమెరికన్ కాలేజ్ టెస్టింగ్ (ఏసీటీ), స్కూల్ అండ్ కాలేజీ ఎబిలిటీ టెస్ట్‌లలో ప్రీషా అత్యద్భుతమైన ప్రదర్శన కనబరిచింది.

వెర్బల్, క్వాంటిటేటివ్ విభాగాల్లో ప్రీషా అడ్వాన్స్ గ్రేడ్ 5 ప్రదర్శనల్లో 99వ పర్సంటైల్‌తో సమానంగా గ్రాండ్ ఆనర్స్‌ను సొంతం చేసుకుంది. గణితం, కంప్యూటర్ ప్రోగ్రామింగ్, రసాయన, భౌతిక శాస్త్రం, రీడింగ్, రైటింగ్ వంటి వాటిలో 2-12 గ్రేడ్‌లలో ఉన్న అడ్వాన్స్‌డ్ విద్యార్థుల కోసం 250కిపైగా ఉన్న జాన్స్ హాప్‌కిన్స్ సీటీవీ ఆన్‌లైన్, ఆన్ క్యాంపస్ ప్రోగ్రాంలకు ప్రీషా అర్హత సాధించింది.

ప్రపంచ ప్రసిద్ధ మెన్సా ఫౌండేషన్‌లో జీవితకాల సభ్యురాలు కూడా.

ప్రపంచంలోనే అత్యంత పురాతనమైన హై-ఐక్యూ సొసైటీ ఇది. 98 పర్సంటైల్ కంటే ఎక్కువ స్కోర్ చేసిన వారికి మాత్రమే ఇక్కడ సభ్యత్వం అందుబాటులో ఉంటుంది.

కే-12 విద్యార్థులను అంచనా వేసే జాతీయస్థాయి నాగ్లీరీ నాన్ వెర్బల్ ఎబిలిటీ టెస్ట్ (ఎన్ఎన్ఏటీ)ని ఆరేళ్ల వయసు లోనే పూర్తిచేయడం ద్వారా ప్రీషా ఈ ఘనత సాధించింది. అంతమాత్రాన ప్రీషా పుస్తకాల పురుగేం కాదు. ట్రావెలింగ్ అన్నా, హైకింగ్ అన్నా, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ అన్నా ఈ చిన్నారికి ఎంతో ఇష్టం. ■

## మసాలా ఛాయ్‌కి ప్రపంచస్థాయి గుర్తింపు!

మన మసాలా ఛాయ్ ప్రపంచంలోనే ఉత్తమమైన నాన్ ఆల్కహాలిక్ పానీయాల జాబితాలో రెండో స్థానంలో నిలిచింది. టేస్ట్ అట్లాస్ ప్రకటించిన ర్యాంకింగ్స్ డీల్స్‌లో మన మసాలా ఛాయ్‌కు టాప్ టూ స్థానం దక్కింది. భారత్‌కు చెందిన ఛాయ్ మసాలా మెరుగైన పానీయం. బ్లాక్ టీ, పాలతో పాటు అల్లం, మిరియాల పొడి, యాలకులు, లవంగాలు, దాల్చినచెక్క వంటి మసాల దినుసుల మిశ్రమంతో దీన్ని రూపొందిస్తారని టేస్ట్‌అట్లాస్ ఇన్‌స్టాగ్రాంలో రాసుకొచ్చింది. ఇక మెక్సికోకు చెందిన అగాస్ ఫ్రెస్కాస్ ఈ జాబితాలో ఫస్ట్ ర్యాంక్‌లో నిలిచింది.

పండ్లు, పూలు, కుకుంబర్స్, సీడ్స్, సిరిల్స్, షుగర్, వాటర్‌తో ఈ పానీయాన్ని తయారు చేస్తారు. మన దేశానికి చెందిన మ్యాంగో లస్సీ మూడో స్థానం దక్కించుకుంది. అంతకుముందు ప్రపంచంలోనే అత్యుత్తమ డైరీ పానీయంగానూ మ్యాంగో లస్సీ ఘనత సాధించింది. ఇక ప్రపంచంలో అత్యుత్తమ రైస్‌గా మన బాస్మతి రైస్ అరుదైన ఘనతను అందుకుంది. ■

# తాకడంలోని తేడాలను పిల్లలకు చెప్పండి...

**అ**భం శుభం తెలియని చిన్నారులపై కామాంధుల కళ్లు పడుతున్నాయి. చిన్నారులపై లైంగిక దాడులు రోజు రోజుకూ పెరిగిపోతున్నాయి. అయితే చాలా సందర్భాల్లో తెలిసిన వారి నుంచే చిన్నారులు ఇలాంటి వేధింపులకు గురవుతున్నారు. కాబట్టి చిన్నారులకు వీటి గురించి అవగాహన కల్పించడం చాలా అవసరం.

వాస్తవానికి శరీరానికి కూడా సొంతంగా కొన్ని నియమాలు ఉంటాయని చిన్న పిల్లలకు తెలియజేయడం ఎంతో ముఖ్యం. ఒకవేళ వాటిని ఇతరులు అతిక్రమిస్తున్నప్పుడు కేవలం స్పందించడమే కాదు.. వెంటనే ఎలా వ్యతిరేకించాలో కూడా నేర్పించాలి. ఇది నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే.

ఆటలాడుకునే వయసులో అత్యాచారం అంటే తెలియని ఆ పసిపిల్లల శరీరాలతో ఆడుకునే మృగాల వంటి కొందరు మగాళ్ల నుంచి తప్పించుకునేందుకు తల్లిదండ్రులే మొదటి టీచర్లు కావాలి. అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు తమని తాము ఎలా కాపాడుకోవాలో పిల్లలకు చెప్పడం ఎంతో అవసరం. ఎప్పుడు, ఎటు నుంచి ఆపద వస్తుందో తెలియని ఈ కాలంలో మన చిన్నారులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి చెప్పాలి.

తాకకూడని చోట ఎవరైనా తడిమితే, భయపడకుండా 'డోంట్ టచ్ మీ' అని గట్టిగా అరిచేలా తర్ఫీదు ఇవ్వాలి. ఇది ఒక్కరోజులో వాళ్ళు అర్థం చేసుకోకపోవచ్చు కానీ వారికి అర్థమయ్యేలా చెప్పాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంది.

**ఎలా చెప్పాలి :**

- మీరు ఏం చెప్పాలనుకుంటున్నారో ముందే ఓసారి అనుకోని సిద్ధం అవ్వండి. మీ పిల్లలు ఆడుకునే బొమ్మల్ని ఇందుకు సాధనంగా ఉపయోగించుకోండి. ఆ బొమ్మ సాయంతో ఏ ప్రదేశాలను తాకొచ్చు, ఏ ప్రదేశాలను తాకకూడదో చెప్పండి. తాకకూడని ప్రదేశాలను ఎవరైనా ముట్టుకునే ప్రయత్నం చేస్తే ఆ వ్యక్తి మంచి వాడు కాదని, తనకు హానీ చేసే అవకాశం ఉందని వారికి అర్థమయ్యే రీతిలో చెప్పండి. అలాంటప్పుడు అక్కడ ఒక సెకను కూడా ఉండకుండా పరుగెత్తుకుంటూ వచ్చేయాలని హెచ్చరించండి.
- షాపుకు తీసుకెళ్తా, మా ఇంట్లో ఆడుకో రా, మా ఫ్రిజ్‌లో చాక్లెట్లు ఉన్నాయి ఇస్తా రా.. ఇలాంటి మాటలను నమ్మవద్దని చెప్పండి. ఇలా చిరుతిళ్లు ఆశపెట్టే ఎక్కువ మంది కామాంధులు పిల్లలను అపహరించడం, వారిని నిర్జన ప్రదేశానికి తీసుకువెళ్లి అఘాయిత్యాలకు పాల్పడం వంటి ఘోరాలు చేస్తున్నారు. కాబట్టి వీటి గురించి ముందే పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి.
- మీరు చెప్పాలనుకున్న విషయాలను చిన్న కథల రూపంలోకి మార్చి చెబితే పిల్లలకు త్వరగా అర్థమవుతుంది. చిన్న చిన్న పదాల్లో, వాళ్ళ చిట్టి మెదడు విషయాన్ని గ్రహించే విధంగా చెప్పాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ విషయంలో చాలా యానిమేషన్ కథలు అందుబాటులో ఉన్నాయి. వాటిని ప్లే చేసి చూడమని చెప్పండి. అది చూశాక పిల్లలకు ఏం అర్థమైందో అడిగి తెలుసుకోండి. అర్థం కాని చోట మీరు వివరించే ప్రయత్నం చేయండి. ప్రపంచంలో బ్యాడ్ టచ్ అనేది ఒకటువందని వారికి అర్థమయ్యేలా చెప్పాలి.
- చిన్నతనం నుంచే పిల్లలకు కళ్లు, చెవులు, ముక్కు గురించి ఎలా చెబుతామో.. అలాగే వ్యక్తిగత శరీర భాగాల గురించి అవగాహన వచ్చేలా చూడాలి. ఎవరైనా తమ ఛాతీ, వ్యక్తిగత శరీర భాగాలు తడుముతుంటే వెంటనే గట్టిగా అరవమని, లేదంటే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని చెప్పాలి. అంతే కాదు అలా ఎవరైనా తాకితే భయపడకుండా మీకు చెప్పమనాలి. తెలియని వారి ఇళ్లకు ఒంటరిగా వెళ్లొద్దని సూచించండి. ■

# బియ్యం కడిగిన నీళ్లతో చర్మసౌందర్యం!

చర్మ సౌందర్యానికి రకరకాల ఉత్పత్తులను వాడేస్తూ ఉంటాం. కానీ ఇవి ఒక్క చర్మానికే వాడినా వీటి సైడ్ ఎఫెక్ట్స్ చాలా రకాలుగా ఉంటాయి. అయితే మార్కెట్‌లో దొరికే ప్రతి ప్రోడక్ట్ చర్మం అందాన్ని పెంచేయదు. వీటితో కొన్ని ఇబ్బందులూ తప్పవు. ఇందుకు భిన్నంగా చర్మ సంరక్షణలో రైస్ వాటర్ (బియ్యం కడిగిన నీరు) చాలా రకాలుగా ఉపయోగపడుతుంది.

కానీ, రైస్ స్కిన్ కేర్ ప్రొడక్ట్స్‌ను బయటి నుంచి కొనే బదులు ఇంట్లోనే ముఖానికి రైస్ వాటర్ వాడుకోవచ్చు. రైస్ వాటర్ చర్మానికి ఒకటి కాదు అనేక ప్రయోజనాలను అందిస్తుంది. ఇది యాంటీ ఏజింగ్ లక్షణాలతో నిండి ఉంది. దీని కారణంగా చర్మం యవ్వనంగా ఉంటుంది. బియ్యం నీరు ముఖాన్ని ప్రకాశవంతం చేయడం, మచ్చలను తొలగించడం, వడదెబ్బ నుండి ఉపశమనం కలిగించడం వంటి ఉపయోగాలను అందిస్తుంది. అలాగే చర్మం నుండి అదనపు జిడ్డును తొలగించడంలో కూడా ప్రభావాన్ని చూపుతుంది. రైస్ వాటర్ తయారు చేసి ముఖానికి అప్లై చేయాలంటే కొన్ని చిట్కాలు ఉన్నాయి.

1. బియ్యం నీటిని తయారు చేయడానికి ఏదైనా ఆసియా బియ్యాన్ని ఉపయోగించవచ్చు.
2. బియ్యాన్ని చల్లని నీటితో మూడుసార్లు కడిగి మూడోసారి కడిగిన నీటిని నిల్వ చేసి ఉంచుకోవాలి.
3. ఈ నీటిని 2 వారాల పాటు ఫ్రిజ్‌లో నిల్వ చేయవచ్చు.
4. బియ్యం నీళ్లను నేరుగా ముఖంపై చిలకరించి,లేదా స్ప్రే బాటిల్లో నింపి ముఖంపై స్ప్రే చేసి గాలికి ఆరనివ్వాలి
5. సాయంత్రం పూట అన్నం నీళ్లను ముఖానికి పట్టించడం వేరు, ఉదయం చేసే విధానం వేరు. ఉదయం రైస్ వాటర్ తర్వాత సీరం, మాయిశ్చరైజర్, సన్ స్క్రీన్ అప్లై చేయవచ్చు. రాత్రి పూట ముఖం కడుక్కొని రైస్ వాటర్ అప్లై చేసి మాయిశ్చరైజర్ రాసుకోవాలి.
6. బియ్యం నీటిని ముఖంపై అన్ని సమయాలలో అప్లై చేయకూడదు.

■

## మధుమేహానికి ముందస్తు సూచనలు !

మధుమేహం (డయాబెటిస్) వచ్చే ముందు మనలో కొన్ని మార్పులు కనిపిస్తాయి. ఈ మార్పులు కనిపించే దశనే ప్రీ డయాబెటిక్ స్టేజ్ అని అంటారు. అయితే అన్ని మార్పులు అందరిలో కనిపించవు. ప్రీ డయాబెటిస్ స్టేజ్‌లో కనిపించే ఆ మార్పులు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం..

ఎ. విపరీతంగా జుట్టు రాలుతుంది. ఉన్నట్టుండి జుట్టు రాలే సమస్య ఎక్కువైందంటే వెంటనే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

బి. ఊరికనే అలసిపోతారు. ఏదైనా శారీరక శ్రమ కలిగించే పని చేస్తే మనుషులు అలసిపోతారు. కానీ, ప్రీ డయాబెటిక్ స్టేజ్‌లో ఏ పని చేయకపోయినా రోజంతా అలసటగా ఉంటుంది.

సి. చర్మంపై మచ్చలు వస్తాయి. కొంతమందిలో షుగర్ సమస్య వచ్చే ముందు చర్మంపై మచ్చలు ఏర్పడుతాయి. అలా మచ్చలు కనిపించినప్పుడు వైద్యులను సంప్రదించాలి.

డి. తరచూ మూత్ర విసర్జన అవుతుంది. షుగర్ లెవల్స్ అదుపులో లేకపోతే మూత్ర విసర్జన అధికంగా ఉంటుంది. ఈ లక్షణం కూడా ప్రీ డయాబెటిక్ స్టేజ్‌లోనే కనిపిస్తుంది.

ఈ. వీటితోపాటే కొందరిలో తీవ్ర తలనొప్పి, మరి కొందరిలో చేతులు, కాళ్లు తిమ్మిర్లు పట్టడం, ఇంకొందరిలో అరికాళ్లలో మంటలు పుట్టడం లాంటి లక్షణాలు ప్రీ డయాబెటిక్ దశలో కనిపిస్తాయి. కొంతమంది నోరు ఎండుకుపోయి నాలుక తడారినట్లు అనిపిస్తుంది. ■

# తగ్గిన తెల్లజొన్న సాగు ... పెరిగిన గిరాకీ !

**మా**రిన ఆహారపు అలవాట్ల నేపథ్యంలో ప్రతి పదిమందిలో ముగ్గురు చక్కెర వ్యాధి బారిన పడుతున్నారు. వైద్యుల సూచన మేరకు వారు ఒక్కపూటైనా జొన్న, గోధుమ రొట్టె తినాల్సిన పరిస్థితి. దీంతో జొన్నలకు డిమాండ్ ఏటేటా పెరుగుతుండగా, జోగులాంబ జిల్లాలో సాగు మాత్రం నానాటికీ తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో జొన్న ధరలు పెరుగుతున్నాయి. కొన్ని చోట్ల రైతులు కేవలం తమ సొంత అవసరాల కోసం అరెకరా, ఎకరా విస్తీర్ణంలో మాత్రమే సాగు చేసుకునేవారు. ఈసారి ఆ పరిస్థితి కూడా పొలాలలో కనిపించడంలేదని వ్యవసాయ అధికారులంటున్నారు.



సాగులో ఇబ్బందులు, ఆశించిన దిగుబడులు రావన్న ఆలోచనతో రైతులు యాసంగిలో మొక్కజొన్న, వరి, వేరుశనగ ఇతర వాణిజ్య పంటల సాగుకు మొగ్గు చూపుతుండటమే జొన్న సాగు విస్తీర్ణం తగ్గిపోవడానికి కారణమని అధికారులంటున్నారు.

**పది శాతం అవసరాలకే**

ఉమ్మడి జిల్లాలో సాగు తక్కువ వినియోగం ఎక్కువ అన్న విధంగా ఉంది. జోగులాంబ జిల్లాలో కాస్త ఆశాజనకంగా ఉండగా వనపర్తి, మహబూబ్‌గర్ జిల్లాలలో అత్యల్పంగా సాగైంది. ఉమ్మడి జిల్లా మొత్తం కలిపినా 35 వేల క్వింటాళ్లకు మించి దిగుబడి రాని పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో 6.50 లక్షలకు పైగా కుటుంబాలున్నాయి. ధనిక పేద అన్న తేడా లేకుండా తెల్లజొన్న అన్నది నిత్యావసరంగా మారిన పరిస్థితి. జిల్లాలో ఏడాది వాడకానికి 3.5 లక్షల క్వింటాళ్ల వరకు జొన్నలు అవసరం కాగా, దిగుబడి మాత్రం పది శాతం లోపే ఉంది.

**కర్ణాటక నుంచి దిగుమతి**

ఉమ్మడి జిల్లాలోని వ్యాపారులు కర్ణాటకలోని రాయచూరు, మాన్వి, సింధనూరు, లింగసూగూరు తదితర ప్రాంతాల నుంచి తెల్లజొన్న దిగుమతి చేసుకొని వినియోగదారులకు విక్రయిస్తున్నారు. రాయచూరులో గతేడాది పండిన జొన్నలు క్వింటాల్ రూ. 8,500 వరకు, కొత్త పంటను క్వింటాల్ రూ. 7,500 వరకు విక్రయిస్తున్నారు. ఉమ్మడి



జిల్లాలో ప్రస్తుతం జొన్న క్వింటాల్ రూ. 8,800 వరకు ఉంది. ఏప్రిల్ నాటికి ధరలు రూ. 9వేల వరకు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులంటున్నారు. కర్ణాటకలో సైతం వర్షాభావ పరిస్థితుల కారణంగా సాగు ఈసారి 40 శాతం కూడా లేకపోవటంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

**సాగును ప్రోత్సహిస్తున్నాం :** తెల్లజొన్న సాగుకు రైతులు ముందుకు రావటం లేదు. జొన్నలో విభిన్నమైన మంచి దిగుబడులు ఇచ్చే విత్తన రకాలున్నాయి. వాటి గురించి ఆసక్తి ఉన్న రైతులకు అవగాహన కల్పించి సాగును ప్రోత్సహిస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారులు తెలిపారు. జోగులాంబ జిల్లాలో గతేడాదితో పోలిస్తే సాగు ఆశాజనకంగానే వున్నదని వారు అన్నారు. ■

ఏ పరిస్థితులలో వున్నా నీ కర్తవ్యం నీకు గుర్తుంటే జరగవలసిన పనులు అవే జరిగి పోతాయి

# కూలీలు దొరకక చేలల్లోనే తెల్లబంగారం



**పత్తి** రైతుకు పెద్ద కష్టమే వచ్చింది. వర్షాలు అనుకూలించి ఆశించిన స్థాయిలో పంట పండగా, ఏరేందుకు కూలీలు దొరకక చేలల్లోనే రాలిపోతున్నది. ఆరు గాలం కష్టపడి పండించిన తెల్లబంగారం చేతికి అందకుండా పోయి నష్టపోవాల్సిన దుస్థితి నెలకొనగా, కర్షకుల్లో ఆందోళన కనిపిస్తున్నది.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఈ ఏడాది దాదాపు 3.30 లక్షల ఎకరాల్లో పత్తి సాగయ్యింది. వర్షాలు అనుకూలించడంతో అనుకున్న స్థాయిలో పంట పండింది. గతంలో ఎకరానికి ఐదారు క్వింటాళ్ల దిగుబడి రాగా, ఈ ఏడాది 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు వస్తోంది. మొత్తంగా 10 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటిదాకా సుమారు 6 లక్షల క్వింటాళ్ల వ్యాపారం జరిగినట్లు తెలుస్తున్నది.

**కూలీల కొరతతో..**

మొదట సీసీఐ ద్వారా పత్తి ధర క్వింటాలుకు రూ. 7100 నిర్ణయించగా, ప్రైవేటు వ్యాపారులు రూ. 7000 చెల్లించి కొనుగోలు చేశారు. గత నెల నుంచి పత్తి ధర తగ్గించి రూ. 6500 నుంచి రూ. 6800 వరకు కొనుగోలు చేస్తున్నారు. ఒకటీ రెండుసార్లు తీసిన పత్తితో పెట్టుబడి ఖర్చులు రాగా, ఇక లాభాలు వస్తాయనుకున్న సమయంలో కూలీల కొరత వెంటాడుతున్నది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్‌లలోని వేలాది ఎకరాల్లో పత్తి వృథాగా పోతున్నది.

ఉపాధి హామీ పనులు ప్రారంభంకావడంతో పాటు పొరుగు జిల్లాల్లో మిర్చి, పసుపు పంటలను తీసేందుకు కూలీలు తరలివెళ్తుండగా, ఇక్కడ కొరత ఏర్పడింది. పత్తిని ఏరే కూలీలకు మొదట కిలోకు రూ. 6 చొప్పున ఇవ్వగా, ఇప్పుడు కిలోకు రూ. 12 చొప్పున ఇస్తామన్నా రాని పరిస్థితి ఎదురైంది.. ఇక పలుచోట్కట్లైతే ప్రతి రోజూ రూ. 300 కూలి ఇస్తామన్నా వెనుకడుగు వేస్తున్నారు. కుటుంబ సభ్యులు ఎక్కువగా ఉన్నవారు తమ చేలల్లోని పత్తిని వారే ఏరుకుంటున్నారు. పెద్ద ఎత్తున పత్తిని సాగుచేసిన రైతులు మాత్రం చేసేదేమీ లేక తలలు పట్టు కుంటున్నారు. పత్తి ధర పెరిగినా ఫలితం లేకుండా పోయే పరిస్థితి వచ్చింది. లక్షలాది రూపాయల విలువ చేసే తెల్లబంగారం మట్టిపాలవుతున్నది. ■

## కాల్షియం లోపాన్ని ఇలా గుర్తించండి

**శ**రీరంలో ఎముకలు, దంతాలు, కండరాలు బలంగా ఉండటానికి కాల్షియం చాలా అవసరం. అయితే సరైన ఆహారం తీసుకోని వారిలో, చిన్నపిల్లల్లో, వయస్సు పైబడిన వారిలో కాల్షియం లోపం ఎక్కువగా ఉంటుంది. ఇది ఎక్కువగా స్త్రీలలో కనిపిస్తోంది. శరీరంలో విటమిన్–డి తగ్గడం, హైపో థైరాయిడిజం వల్ల కాల్షియం లోపం ఏర్పడుతుంది. అయితే దీన్ని ఎలా గుర్తించాలనే విషయం చాలామందికి తెలియదు. కాల్షియం లోపాన్ని ఎలా గుర్తించవచ్చో చూద్దాం.

- కండరాల నొప్పులు ఎక్కువగా ఉండటం, శరీరంలో వణుకు, డిప్రెషన్, ఆందోళన వంటి మానసిక సమస్యలను కాల్షియం లోపానికి సంకేతంగా చెప్పవచ్చు. అలాగే ఏ పని చేసినా త్వరగా అలసిపోవడం, ఆకలి తగ్గిపోవడం, నిద్రలేమి, పెళుసైన గోళ్లు, చర్మం పొడిబారడం వంటి లక్షణాలు ఈ లోపంలో కనిపిస్తాయి.
- సజ్జలు, రాగులు, గోధుమ పిండి, కంది పప్పు, మినప పప్పు, పెసర పప్పు, ఉలవలు, మునగాకు, కరివేపాకు, తోటకూర, నువ్వులు, వేయించిన పల్లీలు, మాంసం, గుడ్డు, బర్రె పాలు, ఆవు పాలలో కాల్షియం లభిస్తుంది. సాల్మన్‌చేపలు, వైట్‌బీన్స్, బ్రొకలీలో కాల్షియం ఎక్కువగా ఉంటుంది. వీటిని ఆహారంలో చేర్చుకోండి. ■

# మరో ఘోర వైరస్ .... 48 వేల ఏండ్ల తర్వాత మళ్ళీ !

అదొక డేంజరస్ వైరస్! అది సోకిన వెంటనే మనుషులు రాక్షసుల్లా మారిపోతారు! కాళ్లు, చేతులు వంకర్లు పోవడంతో పాటు పిచ్చిపట్టినట్లు ప్రవర్తిస్తారు! విచక్షణ, ఆలోచించే జ్ఞానం కోల్పోయి మృగాల్లా మారిపోతారు! ఇన్ని రోజులుగా మనం హాలీవుడ్ సినిమాల్లో చూస్తున్న జాంబీ వైరస్ కథ ఇదీ! నిన్నటిదాకా ఫిక్షనల్ స్టోరీగా ఉన్న ఈ వైరస్.. తొందరలోనే నిజం కాబోతున్నదని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. వేల ఏండ్లుగా మంచులో కప్పబడిన ఈ వైరస్లు.. ఇప్పుడు బయటకు వస్తుందన్న అంచనాతో ఒక్కసారిగా ప్రజలు ఉలిక్కిపడుతున్నారు. కరోనా వైరస్ సృష్టించిన విలయతాండవం నుంచి ఇంకా బయటపడక ముందే.. అంతకుమించిన ప్రమాదకరమైన వైరస్‌లు మనుషులపైకి దండయాత్ర చేసేందుకు వస్తుందన్న విషయం తెలిసి బెంబేలెత్తిపోతున్నారు.

గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఆర్కిటిక్ లోని మంచు వేగంగా కరిగిపోతుందని ప్రపంచవ్యాప్తంగా –పర్యావరణ వేత్తలు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమం లోనే ఆర్కిటిక్ మంచు కరిగిపోవడం వల్ల వచ్చే ప్రమాదాలపై పరిశోధన చేపట్టిన ఎయిక్స్ మార్సిల్లే పరిశోధకులకు చెమటలు పట్టే నిజాలు –తెలిశాయి. వేల ఏండ్ల క్రితం ఆర్కిటిక్ మంచులో గడ్డకట్టుకుపోయినా.. ఇంకా సజీవంగానే ఉన్నాయన్న విషయం వారి పరిశోధనల్లో వెల్లడైంది. భూతాపం కారణంగా మంచు కరిగిపోవడంతో.. ఇప్పుడు ఆ వైరస్‌లు బయటకు వస్తున్నాయని తెలిసింది.

రష్యాలోని సైబీరియన్ ప్రాంతంలో కరుగుతున్న మంచు నమూనాలను పరిశీలించిన సైంటిస్టులు.. 13 కొత్త తరహా వైరస్‌లను 2022లో గుర్తించారు. వీటిపై తాజాగా పరిశోధనలు జరిపిన సైంటిస్టులు.. వీటిలో 48,500 ఏండ్ల క్రితం గడ్డకట్టుకుపోయిన జాంబీ తరహా వైరస్‌లు కూడా ఉన్నాయని గుర్తించారు. ఈ వైరస్‌లు ఇంకా సజీవంగానే ఉన్నాయని, త్వరలోనే ఉనికిలోకి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

ఆర్కిటిక్‌లోని మంచు కరిగిపోవడంతో అందులోని వైరస్‌లు ఇప్పుడు ఇతర ప్రాంతాల్లోకి వెళ్తాయని.. ముఖ్యంగా జనావాసాల్లోకి వచ్చే అవకాశం ఉందని పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ఈ వైరస్ వ్యాప్తి దక్షిణ ప్రాంతాల్లో మొదలై.. ఉత్తర ప్రాంతాలకు వ్యాపించే అవకాశం ఉందని ఎయిక్స్ మార్సిల్లే పరిశోధకులు చెబుతున్నారు.

ఈ జాంబీ వైరస్‌లు బయటకొస్తే పురాతన పోలియో తరహా అనారోగ్యాలు మళ్లీ వచ్చే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. ఈ వైరస్‌ల కారణంగా ఎటువంటి నష్టం జరుగుతుందనే విషయం స్పష్టంగా తెలియనప్పటికీ.. మానవాళి మనుగడకే ప్రమాదం ఉంటుందని మాత్రం హెచ్చరిస్తున్నారు. ■

## హిమోగ్లోబిన్ లోపానికి వీటితో చెక్!

- రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తిని పెంచడంలో ఐరన్ కీలకపాత్ర పోషిస్తుంది. అందుకే ఐరన్ పుష్కలంగా ఉండే ఆహార పదార్థాలను మనం తినాలి.
- ఆకుకూరలు, టమాట, కోడిగుడ్లు, చికెన్, సీఫుడ్, ఖర్జూరం, బాదం, బీన్స్, తృణధాన్యాలు, పెరుగు తీసుకోవాలి.
- సీ విటమిన్ కోసం నారింజ, నిమ్మ, బ్రకోలి, ద్రాక్ష, బొప్పాయి తినాలి.
- ఫోలిక్ యాసిడ్ అధికంగా లభించే బచ్చలికూర, పల్లీలు, కిడ్నీ బీన్స్, అవకాడో, పాలకూరలను తినాలి
- ఖర్జూరం, నువ్వులు, ఎండు ద్రాక్ష వంటివి రోజూ తినేలా ప్లాన్ చేసుకోవాలి.
- టీ, కాఫీ, సోడా, ఆల్కహాల్లను దూరం పెట్టాలి.

# అత్తా కోడళ్ళపై హైకోర్టు సంచలన తీర్పు ...!

**ప్రతి** ఇంట్లో అత్తాకోడళ్ల మధ్య విభేధాలు తలెత్తడం సర్వసాధారణం. అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు.. వీరిద్దరి మధ్య కొడుకు లేదా భర్త నలిగిపోతుంటాడు. అత్తలను హింసించిన కోడలు, అత్త కోడలిపై దుర్భాషలాడుతూ చిత్రహింసకు గురిచేసిన ఘటనలు చాలానే వెలుగులోకి వచ్చాయి. తాజాగా ఓ కుటుంబంలోని అత్త, కోడలు, కొడుకుకు సంబంధించిన ఓ కేసులో జార్ఖండ్ హైకోర్టు ఇచ్చిన తీర్పు కూడా చాలా ఆసక్తికరంగా ఉంది.

**ఇక అసలు విషయానికొస్తే...** భారతీయ సంప్రదాయం ప్రకారం పెళ్లయిన మహిళ తన అత్తను, ఆ ఇంట్లో ఉండే వృద్ధురాలైన భర్త, అమ్మమ్మలకు సేవ చేయాల్సిన బాధ్యత ఉందని జార్ఖండ్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ఈ బాధ్యత నుంచి తప్పించుకోకూడదంటూ వ్యాఖ్యానించింది. అదే సమయంలో తల్లికి భర్తను దూరం చేయరాదని దూరంగా ఉండాలంటూ ఒత్తిడి కూడా చేయరాదని కోడలికి హైకోర్టు సూచించింది.

జార్ఖండ్‌కు చెందిన రుద్రనారాయణ రాయ్ అనే వ్యక్తి విడాకుల కోసం స్థానిక ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా దాన్ని విచారణ చేసిన ధర్మాసనం భార్యకు నెలకు రూ.30వేలు, కొడుకుకు రూ.15వేలు చెల్లించాల్సిందిగా తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో సంతృప్తి చెందని రుద్రనారాయణ్.. హైకోర్టును ఆశ్రయించాడు.

విచారణ చేసిన హైకోర్టు ధర్మాసనం ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. సరైన కారణం లేకుండా భర్తతో విడిపోయేందుకు సిద్ధపడిన మహిళకు మెయిన్‌టెనెన్స్ ఇవ్వాల్సిన అవసరం లేదని భావించింది. అయితే కొడుకుకు ఇస్తున్న మెయిన్‌టెనెన్స్‌ను మాత్రం రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచుతూ తీర్పు వెలువరించింది.

ఈ తీర్పును వెలువరించేందుకు కోర్టు రాజ్యాంగంలోని 51-ఎ ఆర్టికల్‌ను రిఫర్ చేసింది. అదే సమయంలో యజుర్వేద, మనుస్మృతిలలో ఉన్న వాక్యాల్ని గుర్తు చేసింది. భారతీయ గొప్ప మహోన్నత సంప్రదాయాలను, విలువలను, వారసత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 51-ఎ చెబుతోందని న్యాయమూర్తి పేర్కొన్నారు.

భారతీయ కుటుంబ వ్యవస్థలో భాగంగా ఉన్న అత్తను, ఆమె తల్లిని గౌరవించి సేవచేయాల్సిన బాధ్యత కోడలిపై ఉందని , ఇదే భారతదేశ ఘన సంస్కృతని పేర్కొంది. ■

## ఈ పాట ఆడపిల్లలకు అంకితం!

**గృ**హిణిగా ఇంటి నిర్వహణతో పాటు మెరుగైన సమాజాన్ని నిర్మించడంలో మహిళల పాత్ర, కృషిని వివరిస్తూ ఇండో టిబెటన్ బోర్డర్ ఫోర్స్ (ఐటీబీఎఫ్) తన అధికారిక ట్విట్టర్, ఫేస్‌బుక్ ఖాతాలో... తాజాగా పోస్ట్ చేసిన ఒక వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ అవుతోంది.

'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా విడుదల చేసిన ఈ పాటను ఐటీబీఎఫ్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తోన్న అర్జున్ ఖేరియాలా హిందీలో రాశారు. స్వతహాగా సంగీత ప్రియుడైన ఆయన స్వయంగా కంపోజ్ చేసి పాడిన ఈ పాటను ఆడపిల్లలకు అంకితం చేశారు. 'లాడో..మేరి లాడో..'అంటూ సాగే ఈ వీడియో ('లాడో.. మేరి లాడో'' అంటే 'నా గారాల బిడ్డ' అని అర్థం) ఒక సైనికుడు సెలవుల్లో తన కుటుంబంతో గడిపే ఆనంద క్షణాలు, తిరిగి విధులకు వెళ్లే సమయంలో అతడితో పాటు కుటుంబసభ్యులు భావోద్వేగానికి గురయ్యే దృశ్యాలు, సైనికుడు అతడి కూతురు మధ్య ఉండే అనుబంధాన్ని ఎంతో చక్కగా ఆవిష్కరించింది ఈ వీడియో. అంతేకాదు ఆడపిల్లలను చదివించాలనే సందేశాన్ని చాటింది. 7 నిమిషాల 24 సెకన్ల నిడివి ఉన్న ఈ వీడియో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'బేటీ బచావో.. బేటీ పఢావో' కార్యక్రమాన్ని ప్రమోట్ చేస్తోంది. ■

# ప్రతి గ్రామంలో వ్యవసాయ, పాల, చేపల సంఘాలు

**ప్రతి** గ్రామం లేక పంచాయతీలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, పాల ఉత్పత్తిదారుల, మత్స్యకారుల సంఘాలను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. సంబంధిత మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాల సీఎస్‌లకు పంపింది. ఈ సొసైటీల ద్వారా ఊరంతా సంఘటితం కావడంతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొంది. దశలవారీగా వచ్చే అయిదేళ్లలో వీటి ఏర్పాటు జరగాలని, వివిధ కేంద్ర పథకాలను వాటికి అనుసంధానం చేస్తామని స్పష్టం చేసింది.

వీటికి అనుగుణంగా జిల్లా, రాష్ట్ర స్థాయి సహకార అభివృద్ధి కమిటీలను ఏర్పాటు చేయాలంది. సహకారం ద్వారా శ్రేయస్సే లక్ష్యంగా.. గ్రామాల్లోని రైతులను, పాడి రైతులను, గొర్రెలు, మేకల, చేపల పెంపకందార్లను సంబంధిత సంఘాల్లో సభ్యులుగా చేర్పించి. సంఘాలను రిజిస్టర్ చేయించాలని, ఆ వివరాలను కేంద్రానికి పంపించాలని నిర్దేశించింది. ఈ ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం.. పశుసంవర్ధక, మత్స్య, సహకార శాఖల అధికారులకు పంపి.. అమలుకు కసరత్తు చేయాలని ఆదేశించింది.

**నిపుణుల కమిటీ సూచనల మేరకు**

దేశంలో సహకార రంగం బలోపేతానికి 2021లో కేంద్రం ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఈ శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సహకార రంగంలో సంస్కరణలు, నూతన ఆవిష్కరణలతో పాటు అభివృద్ధికి వినూత్న అంశాలపై కేంద్రం దృష్టి సారించింది. దీనిపై ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా గతేడాది ఫిబ్రవరి 15న కేంద్ర మంత్రి మండలి పలు నిర్ణయాలు తీసుకుంది. ప్రతి గ్రామంలో ఈ మూడు సంఘాల ఏర్పాటుకు ప్రస్తుతం మార్గదర్శకాలు వెలువరించింది.

**రాష్ట్రంలో ప్రస్తుత పరిస్థితి ఇదీ..**

తెలంగాణా రాష్ట్రంలో గ్రామాలు 12,774 ఉండగా.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు 906, మత్స్య సహకార సంఘాలు 3,717 పాల సహకార సంఘాలు 135 మాత్రమే ఉన్నాయి. కేంద్రం మార్గదర్శకాల మేరకు.... రాష్ట్రంలో కొత్త సొసైటీలను వేల సంఖ్యలోనే ఏర్పాటు చేయాల్సి ఉంది. ■




## తెలంగాణ కూచిపూడి బాలనర్తకికి ప్రధాని పురస్కారం

**తె**లంగాణ బాలిక పెండ్యాల లక్ష్మీ ప్రియకు (14) 'పీఎం రాష్ట్రీయ బాల పురస్కారం' దక్కింది. కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరుస్తున్నందున ఆమెకు ఈ అవార్డు దక్కింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా లక్ష్మీ ప్రియ బాల పురస్కారాన్ని స్వీకరించింది. ఆమెతో పాటు మరో 9 మంది బాలికలు, 9 మంది బాలురకు ఈ పురస్కారాలు లభించాయి. న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో వీరంతా అవార్డులు పొందారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలైన బాల, బాలికలను ఉద్దేశించి రాష్ట్రపతి ముర్మ మాట్లాడారు. ఏదో ఒక క్రీడలో ప్రావీణ్యం సాధించి మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు పోటీతత్వాన్ని మెరుగుపరచుకోవచ్చని సూచించారు.

సంకల్ప శక్తి బలం అమోఘం ; నిర్మలమైన, అచంచలమైన సంకల్పం ముందు ఇతర శక్తులన్నీ వీగిపోవలసిందే

# సేంద్రియ కూరగాయ విత్తనాల చిరునామా చందన !

**ఆ**ర్గానిక్ పంటలు.. నూటికి నూరుపాళ్లు ఆరోగ్యకరం. కానీ, సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయల ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. అంతేకాదు, చాలా పంటలు ఎలాంటి ధ్రువీకరణ లేకుండానే మార్కెట్‌లో ఆర్గానిక్ ముద్రతో చెలామణి అవుతున్నాయి. ఆర్గానిక్ విత్తనాలతో పెరట్లోనే సేంద్రియ కూరగాయల సాగు చేపడితే.. ఆరోగ్యానికి ఆరోగ్యం, ఆదాకు ఆదా. ఓ తల్లిగా తనకొచ్చిన ఆ ఆలోచనకు వ్యాపార రూపం ఇచ్చారు seedbasket.in వ్యవస్థాపకురాలు శ్రీమతి చందన దుగ్గినేని.

చందన దుగ్గినేని స్వస్థలం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా. ఆమెది అచ్చమైన గ్రామీణ నేపథ్యం. బాల్యం నుంచి వ్యవసాయాన్ని దగ్గరినుంచి చూశారే కానీ, ఏనాడూ సాగు చేసిన అనుభవం లేదు. పెళ్లి తర్వాత భర్త వెంట హైదరాబాద్ వచ్చేశారు. ఓ బిడ్డకు తల్లి అయ్యారు. పిల్లలకు బలవర్ధకమైన ఆహారం ఇవ్వాల్సిన అవసరం గురించి వైద్యులు చెబుతున్నప్పుడు.. తొలిసారిగా చందన మనసులో ఓ బిజినెస్ ఐడియా తళుక్కుమంది.

క్రిమిసంహారకాలు పిచికారీ చేయని కూరగాయలు, ఆకుకూరలు మార్కెట్‌లో దొరకడం గగనమే. దొరికినా జేబులు ఖాళీ చేసుకోవాల్సిందే. అందుకే, ఎంతో కష్టపడి అచ్చమైన దేశీ విత్తనాలు సేకరించారు. బాల్కనీలోని కొద్దిపాటి స్థలంలో ఆకుకూరలు, కూరగాయలు పండించారు. వాటితో వండిన వంటకాలను బిడ్డకు గోరుముద్దలుగా తినిపించారు.

ఓ దశలో తానే దేశీ విత్తనాలను ఎందుకు విక్రయించకూడదనే అభిప్రాయానికి వచ్చారు. అప్పటికే అమ్ముల పొదిలో సిద్ధంగా ఉన్న ఐడియాకు ప్రాణంపోసి.. seedbasket.in అనే ఈ కామర్స్ సంస్థను స్థాపించారు. ఎంసీఏ చదవడం వల్ల వెబ్‌సైట్ డిజైనింగ్ పెద్ద అవరోధం కాలేదు. తొలిదశలో భర్త సాయంతో ఇంటి వద్దనే విత్తనాలను అభివృద్ధి చేశారు. క్రమంగా ఎంపిక చేసుకున్న రైతుల నుంచి కొనుగోలు చేయడం ప్రారంభించారు. వాటిని ఇంటి వాతావరణంలో సాగు చేసుకునేలా కస్టమర్లకు ఎరువులు, గార్డెనింగ్ పనిముట్లు కూడా అందిస్తారు



ఆమె. విత్తనాల ప్యాకింగ్ యూనిట్‌నూ ఏర్పాటు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన 4-7 రోజుల వ్యవధిలో దేశంలోని ఏ మూలకైనా డెలివరీ చేస్తారు.

రసాయన ఎరువుల సేద్యంతో పోలిస్తే.. ఆర్గానిక్ వ్యవసాయంలో దిగుబడి తక్కువ. దీంతో రైతులు పెద్దగా ఆసక్తి చూపరు. విత్తనాల అభివృద్ధికి అసలే ముందుకు రారు. సీడ్‌బాస్కెట్.కామ్ రైతులను ఒప్పిస్తూ, గిట్టుబాటు ధర అందిస్తూ విత్తనాల కొరత తీరుస్తున్నది.

మన చుట్టుపక్కల కూరగాయల విత్తనాలను విక్రయించే సంస్థలు చాలానే ఉన్నా.. సహజమైన పద్ధతిలో సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో సమకూర్చే కంపెనీలు చాలా అరుదు. కాబట్టే, ప్రారంభించిన ఐదేళ్లలోనే సీడ్‌బాస్కెట్.కామ్ రూ. 50 లక్షల టర్నోవర్‌కు చేరింది.

తనతోపాటు మరో ఆరుగురికి ఉపాధినిస్తూ క్రమంగా విక్రయాలను పెంచుకుంటున్నారు చందన. విత్తనాల ధరలు కూడా రూ.30 నుంచి రూ. 300 లోపే ఉండేలా జాగ్రత్త పడ్డారు. ఇప్పటివరకు 30 వేల మంది ఖాతాదారులు తమ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకున్నారని సగర్వంగా ప్రకటిస్తారు చందన. సాధారణ పంటలతోపాటు అరుదుగా దొరికే తెల్లకాకర, ఎల్లో క్యాప్సికం, ఎర్రతోటకూర, ఎర్రబెండ, బేబీకార్న్, చిన్నమెంతి, బ్రొకోలితో పాటు పూల మొక్కల విత్తనాలు కూడా విక్రయిస్తున్నారామె. ■

# పేదరికం పోవాలంటే మరో 200 ఏండ్లు : ఆక్స్‌ఫాం

ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం సమస్య అంతమొందాలంటే కనీసం మరో 200 ఏండ్లకు పైగా సమయం అవసరమని ఆక్స్‌ఫాం నివేదిక వెల్లడించింది.

ప్రపంచంలో ఐదుగురు అత్యంత కుబేరుల సంపద 2020 నుంచి రెట్టింపు కాగా, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 500 కోట్ల మంది పేదరికంలోకి నెట్టబడ్డారని ఈ నివేదిక తెలిపింది. ఇవే ధోరణులు కొనసాగితే రానున్న 230 ఏండ్లలో పేదరికాన్ని రూపుమాపడం సంక్లిష్టమైన ప్రక్రియగా మారుతుందని పేర్కొంది.

అత్యంత ధనికుల చేతిలో కార్పొరేట్ యాజమాన్యాలు బందీ కావడం ఆందోళన రేకెత్తిస్తోందని తెలిపింది. అమెరికా, దక్షిణాఫ్రికా, బ్రెజిల్‌లో అసమానతలు పెరిగాయని ఆర్థిక శక్తి కేంద్రీకరణ విచారకరమని నివేదిక వెల్లడించింది. ప్రపంచ ఆస్తుల్లో 43 శాతం ప్రపంచంలో 1 శాతం అత్యంత సంపన్న వర్గం గుప్పిట్లోనే మగ్గుతున్నాయని పేర్కొంది.

అదేమాదిరిగా మధ్యప్రాచ్యం, ఆసియా, యూరప్ దేశాల్లోనూ ఇదే తరహా అసమానతలున్నాయని నివేదిక తెలిపింది. సంపన్న వర్గమైన ఒక శాతం చేతిలో 47 నుంచి 50 శాతం ఆస్తులున్నాయని వెల్లడించింది.

ప్రపంచంలో 50 అతిపెద్ద పబ్లిక్ కార్పొరేషన్స్‌లో 34 శాతం సంస్థలకు బిలియనీర్ సీఈవో లేదా బిలియనీర్ ప్రధాన వాటాదారుగా ఉన్నారని ఆక్స్‌ఫాం పరిశోధన తెలిపింది. ఈ కార్పొరేషన్ల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 13.3 ట్రిలియన్ డాలర్లని వివరించింది.

ప్రపంచ సంపదలో అసనమానతలు పెరిగిన క్రమంలో పేదరికాన్ని తగ్గించేందుకు, అందరికీ సమాన అవకాశాలు కలిగిన భవిష్యత్ కోసం వ్యవస్థాగత మార్పులు చేపట్టాలని నివేదిక స్పష్టం చేసింది. కొద్దిమంది కోసం కాకుండా అందరి ప్రయోజనాలకు అద్దం పట్టే ఆర్థిక వ్యవస్థలను పరుగులు పెట్టించేందుకు కీలక అడుగులు పడాల్సిన అవసరం ఉందని ఆక్స్‌ఫాం నివేదిక స్పష్టం చేస్తోంది.

■

## గండబోయనపల్లి ఉన్నత పాఠశాలకు అటవీ పెంపక పురస్కారం!

ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లి ఉన్నత పాఠశాలకు 'కార్నివాల్ ' సంస్థ ' ద గ్రీన్ స్కూల్స్ కార్నివాల్ -2024 ' ఉత్తమ పాఠశాల పురస్కారం లభించింది. ఆ పాఠశాలలో మియావాకి అటవీ పెంపకానికి ఈ అవార్డు లభించింది. జనవరి 30 వ తేదీన ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆ పాఠశాల తరఫున శ్రీ ద్వారకనాథరెడ్డి ఈ పురస్కారాన్ని అందుకున్నారు. కొందరు విద్యార్థులు కూడా పాల్గొన్నారు.




అనేకుల హితం కోసం , సర్వ ప్రాణి సంక్షేమం కోసం త్యాగంచేయడమే ఉత్తమ మానవత్వం

# నేల ఆరోగ్యం - ఉత్పాదకత పెంపుదల

ఆరోగ్యంగా ఉన్న నేలకు ప్రతికూల పరిస్థితులను తట్టుకునే బలం ఉంటుంది
నేల ఆరోగ్యంగా ఉండాలంటే, అందులో తగినంత సేంద్రియ పదార్థం ఉండాలి

## చేపట్టే పనులు



లోతుగా
దుక్కులు దున్నడం



మల్చింగ్



పొలంలో పచ్చి రొట్ట
ఎరువు సాగు



వైవిధ్య పంటల సాగు



చెరువు మట్టి చల్లడం



పంటలమార్పిడి



జీవ ఎరువుల వాడకం



నాణ్యమైన విత్తనాల
వాడకం

NABARD

MAHILA SADHIKARATHA
Publication Date: 01-02-2024 ; Posting Date: 05 & 06-02-2024

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2024-26




ఎఫ్ పి ఓలలో మహిళా వికాసం ... మరికొన్ని దృశ్యాలు ...



ఏపిమాస్‌లో
గణతంత్ర దినోత్సవం



సంక్రాంతి సంబరాలలో ధరణి...



మెహదీపట్నంలో రంగవల్లుల శోభ...



సంబరాలలో పాల్గొన్న ఎం టమాట



యు ఎన్ పి ఆధ్వర్యంలో
ప్రపంచ బాలికా దినోత్సవం



జనగామలో ఎస్ ఎల్ ఎఫ్ సమావేశం



మంచిర్యాలఓలో టి ఎల్ ఎఫ్ సమావేశం



ఎస్ హెచ్ జి , ఎస్ ఎల్ ఎఫ్ మహిళలకు
యు ఎన్ పి ఆధ్వర్యంలో అవగాహన




పరిశ్రమల నిర్వహణపై యర్రగొండపాలెంలో ఎస్ హెచ్ జి
సభ్యులకు ఏపిమాస్ ప్రతినిధుల అవగాహన

To ADDRESS



పూనేకు చెందిన 'వామ్నికామ్' విద్యార్థుల బృందం
ఏపిమాస్ సందర్శన

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089